# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com






హైదరాబాద్ ఆదివారం 20-12-2020 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-2020 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :27 సంచిక:118 పేజీలు:4 వెల: రూ.1/-


# పొంచివున్న సైబర్ ముప్పుతో అప్రమత్తం

## రాఫెల్ రాకతో వైమానికదళం బలోపేతం
## దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో పాసింగ్ ఔట్ పరేడ్ పాల్గొన్న కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

హైదరాబాద్,డిసెంబర్19(ఆర్ఎన్ఎ): స్వదేశీ పరిజ్ఞానంతో రక్షణరంగంలో ఎన్నో ఆవిష్కరణలు చేస్తున్నామని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ తెలిపారు. రఫేల్ రాకతో వాయుసేనలో ఆత్మవిశ్వాసం మరింత పెరిగిందని వ్యాఖ్యానించారు. అయితే సరిహద్దుల్లో ముప్పుతో పాటు సైబర్ ముప్పు కూడా ఇప్పుడు కొత్తగా పరిణమించిందని అన్నారు. హైదరాబాద్ దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో శిక్షణ పూర్తి చేసుకున్న క్యాడెట్ల పాసింగ్ ఔట్ పరేడ్‌లో రాజ్‌నాథ్ పాల్గొన్నారు. దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీని సందర్శించిన కేంద్ర మంత్రి .. శిక్షణ పూర్తి చేసిన క్యాడెట్లు నిర్వహించిన పరేడ్‌లో పాల్గొన్నారు. వాయుసేన అందిస్తున్న సేవలు అభినందనీయమని, ఈ అకాడమీ ఎంతోమంది వీరులను దేశానికి అందించిందని కొనియాడారు. దేశ సార్వభౌమత్వాన్ని కాపాడేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ఉగ్రవాదంపై భారత సైన్యం ఎనలేని పోరు చేస్తోందని రాజ్‌నాథ్‌సింగ్ పేర్కొన్నారు. బాలకోట్ ఘటన అందరికీ తెలిసిందేనన్నారు. ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ ఇప్పుడు చాలా కీలకమని, వాయుసేన అందిస్తున్న సేవలు అనిర్వచనీయమన్నారు. ఎయిర్‌ఫోర్స్ సంక్షేమం కోసం ప్రభుత్వం వెనకడుగు వేయదని రాజ్‌నాథ్‌సింగ్ స్పష్టం చేశారు. అకాడమికి చేరుకున్న కేంద్రమంత్రికి వాయుసేన ఘన స్వాగతం పలికింది. వారి నుంచి గౌరవ వందనం స్వీకరించిన రాజ్‌నాథ్‌సింగ్ ..పాసింగ్ ఔట్ పరేడ్‌లో పాల్గొన్న వారి ప్రదర్శన అద్భుతంగా ఉందని ప్రశంసించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా రాజ్‌నాథ్‌సింగ్ మాట్లాడుతూ.. భారత్ సంఘర్షణ కాదు శాంతిని కోరుకుంటోందని వ్యాఖ్యానిం చారు. ఎలాంటి పరిస్థితులు వచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఉగ్రవాదుల ఏరివేతకు రక్షణ దళాలు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నాయని పేర్కొన్నారు. జల, వాయు, భూమిపై యుద్ధమే కాకుండా సైబర్ యుద్ధం పొంచి ఉందన్న రాజ్‌నాథ్‌సింగ్ రాబోయే రోజుల్లో మరింత సన్నద్ధం కావాలని సూచించారు. స్వంత దేశానికి సెంట్రీలుగా పనిచేయడం అదృష్టమని, మీరంతా మీ విధులకు న్యాయం చేస్తారని భావిస్తున్నట్లు మంత్రి రాజ్‌నాథ్ తెలిపారు. వెస్టర్న్ సెక్టార్‌లోని సరిహద్దులో పాకిస్థాన్ కుటిల ప్రయత్నాలు చేస్తున్నదని, నాలుగు యుద్ధాలు ఓడిన తర్వాత కూడా దాయాది దేశం ఉగ్రవాదులతో పరోక్ష యుద్ధాన్ని చేస్తున్నట్లు రాజ్‌నాథ్ చెప్పారు. అయితే నిరంతరం అప్రమత్తంగా ఉంటూ.. ఉగ్రవాదుల చొరబాట్లను ఆపుతున్న భద్రతా దళాలను ఇటీవల జరిగిన బాలాకోట్ దాడుల వరకు వైమానిక దళం అనన్యమైన ధైర్యసాహసాలను ప్రదర్శించినట్లు మంత్రి తెలిపారు. మన దేశ చరిత్రలోఆ సంఘటనలన్నీ సువర్ణాధ్యాయంగా లిఖించబడుతాయని ఆయన అన్నారు. కార్యక్రమంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డితో పాటు ఎయిర్ చీఫ్ మార్షల్ ఆర్‌కేఎస్ బదౌరియా తదితరులు పాల్గొన్నారు.

గౌరవిస్తున్నట్లు మంత్రి తెలిపారు. భారత వైమానిక దళానికి వైభవోపేతమైన చరిత్ర ఉన్నదని, అనేక సందర్భాల్లో ఎయిర్‌ఫోర్స్ తన విరోచిత సత్తాను చాటిందని, 1971లో జరిగిన లాంగేవాలా యుద్ధం నుంచి




దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో జరిగిన పాసింగ్ ఔట్ పరేడ్‌లో పాల్గొన్న కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

# గుండెపోటుతో శివసేన సీనియర్ నేత మృతి

## ట్విట్టర్‌లో వెల్లడించిన సంజయ్ రౌత్

ముంబై,డిసెంబర్19(ఆర్ఎన్ఎ): శివసేన పార్టీ సీనియర్ నాయకుడు మోహన్ రవాలే (72) శనివారం ఉదయం గోవాలో గుండెపోటుతో మృతిచెందారు. ఈ విషయాన్ని శివసేన అధికార ప్రతినిధి సంజయ్ రౌత్ ట్విట్టర్ ద్వారా వెల్లడించారు. మోహన్ రవాలే కన్నుమూశారు. ఆయన బలమైన శివ సైనికుడు. విశాల హృదయం కలిగిన మిత్రుడు.

శివసేన తరఫున ఐదు సార్లు లోక్‌సభకు ప్రాతినిధ్యం వహించిన మహనీయుడు. ఆయనకు నా నివాళులు అని సంజయ్ రౌత్ ట్విట్టర్‌లో పేర్కొన్నారు. మోహన్ రవాలే 1991 నుంచి 2004 వరకు వరుసగా ఐదుసార్లు ముంబై సౌత్ సెంట్రల్ నియోజకవర్గం నుంచి శివసేన తరఫున లోక్‌సభకు ఎన్నికయ్యారు. అయితే, 2013లో పార్టీ తీరుపై అసమ్మతి గళం వినిపించిన రవాలే సస్పెన్షన్‌కు గురయ్యారు. దాంతో కొంతకాలం పార్టీకి దూరంగా ఉన్న ఆయన ఆ తర్వాత మళ్లీ చేరారు.

# నగర ప్రజలకు న్యూ ఇయర్ బోనాంజా

## గ్రేటర్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 20వేల లీటర్ల నీటి సరఫరా ఉచితం
## అధికారులతో సమీక్షించి ఆదేశించిన మంత్రి కెటిఆర్

హైదరాబాద్,డిసెంబర్19(ఆర్ఎన్ఎ): గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికల వేళ సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు నగరంలోని ప్రతి ఇంటికీ నూతన సంవత్సరం తొలివారంలో ఉచిత తాగునీటి సరఫరా కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. జలమండలి ద్వారా 20 వేల లీటర్ల వరకు తాగునీరు ఉచితంగా ఇస్తామని స్పష్టం చేశారు. ఉచిత తాగునీరు పంపిణీపై మంత్రి కేటీఆర్ శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్, జలమండలి ఉన్నతాధికారులు హాజర య్యారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. నూతన సంవత్సర తొలివారంలో హైదరాబాద్‌లో ఉచిత తాగునీటి కార్యక్రమం ప్రారంభిస్తామని తెలిపారు. ఈ మేరకు జనవరి నెలలో వినియోగదారులకు వచ్చే డిసెంబర్ నెల బిల్లులో 20 వేల లీటర్ల వరకు ఛార్జ్ చేయొద్దని అధికారులను కేటీఆర్ ఆదే శించారు. ఈ కార్యక్రమానికి సంబంధించి ఒకట్రెండు రోజుల్లో విధివిధానాలను సిద్ధం చేయాలని కేటీఆర్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో హైదరా బాద్ నగరంలో జల మండలి ద్వారా జరుగుతున్న తాగునీటి సరఫరాపై కూడా సమీక్షించారు. గత కొన్ని సంవత్సరాలుగా హైదరాబాద్ నగరంలో తాగునీటి సరఫరా చాలా అలా బాగా పెరుగుతూ వస్తున్నదని ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్‌కు అధికా రులు తెలియజేశారు. జలమండలి నీటి సరఫరా సామర్థ్యం కూడా ఏడాదికేడా ది పెంచుకుంటన్నట్లు తెలిపారు. గత ఐదారు సంవత్సరాలుగా పెద్దఎత్తున చేపట్టిన మౌలిక వసతుల కార్యక్రమాల ద్వారా ఇది సాధ్యమైందని ఈ సందర్భంగా వారు మంత్రి కేటీఆర్‌కు తెలిపారు. వచ్చే వేసవికి సైతం సరిపోయే విధంగా నీటి సరఫరా చేసేందుకు ఇప్పటి నుంచే తగిన ప్రణాళిక రూపొందిస్తున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు.

# ప్రగతిభవన్ ముట్టడికి ఆదిలాబాద్ రైతుల యత్నం అడ్డుకుని అరెస్ట్ చేసిన పోలీసులు

హైదరాబాద్,డిసెంబర్19(ఆర్ఎన్ఎ): సిఎం అధికార నివాసం ప్రగతి భవన్‌ను అదిలాబాద్ రైతులు ముట్టడించారు .. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫసల్ బీమా యోజన పథకంలో రాష్ట్ర ప్రభుత్వం పంట నష్టపరిహారం వాటా కింద రెండేళ్లుగా నిధులు విడుదల చేయకపోవడంతో అదిలాబాద్ జిల్లా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. రైతులను మోసం చేస్తున్న ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోవాలని, రుణమాఫీ పథకాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ.. ఆదిలాబాద్ బీజేపీ నేతల ఆధ్వర్యంలో ఈ ముట్టడి నిర్వహించారు.. సెక్యూరిటీని దాటుకొని ప్రగతిభవన్‌లోకి దూసుకెళ్లేందుకు యత్నించారు.. అయితే.. దీంతో.. ప్రగతిభవన్ ఎదుట కాసేపు ఉద్రిక్తత పరిస్థితులు ఏర్పడ్డాయి.. రైతులు, పోలీసుల మధ్య వాగ్వాదం, తోపులాటకు దారితీయగా.. వారిని అరెస్ట్ చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు పోలీసులు.

# కాంగ్రెస్ పార్టీకి మరో షాక్

## విద్యార్థి విభాగం నేత రుచిగుప్తా రాజీనామా

న్యూఢిల్లీ,డిసెంబర్19(ఆర్ఎన్ఎ): కాంగ్రెస్ పార్టీలో అసమ్మతి కొనసాగుతూనే ఉంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు సినీయర్ నేతలు పార్టీ నుంచి తప్పుకుంటున్న సంగతి తెలిసిందే. తాజాగా వీరిలో రుచి గుప్తా కూడా చేరారు. విద్యార్థుల విభాగం, నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా జాయింట్ సెక్రటరీకి ఇంచార్జ్‌గా ఉన్న రుచి శనివారం రాజీనామా చేశారు. ఈ మేరకు రుచి గుప్తా ఓ ప్రకటన విడుదల చేశారు. పార్టీ సంస్థాగత మార్పులలో జాప్యం కారణంగానే తాను కాంగ్రెస్ పార్టీని విడానన్నారు. 'ప్రియమైన అందరికి.. నేను రాజీనామ చేసినట్లు ప్రకటించడం కోసమే ఈ లేఖ రాస్తున్నాను. పార్టీలో ముఖ్యమైన సంస్థాగత మార్పులు చాలాకాలం నుంచి పెండింగ్‌లో పడుతున్న విషయం తెలిసిందే. దాదాపు 1 సంవత్సరం 3 నెలలుగా దీనిపై జాతీయ కమిటీ నిర్ణయాలు తీసుకుంటూనే ఉంది. రాష్ట్ర అధ్యక్షుడి ఆదేశాలు నెలల తరబడి పెండింగ్‌లో పడుతూనే ఉన్నాయి. కొత్త కార్యకర్తలకు పార్టీలో స్థానం కల్పించేందుకు ఇతర రాష్ట్ర యూనిట్లు వేచి చూస్తున్న క్రమంలో జీఎస్(ఓ) నిరంతర జాప్యాలు పార్టీని దెబ్బతీస్తున్నాయి. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో కాంగ్రెస్ అధ్యక్షురాలు పదేపదే జాప్యం చేయడం కూడా సరైనది కాదు' అని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా రుచి గుప్తా పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌పై అసహనం వ్యక్తం చేశారు. సంస్థాగత మార్పులు తరచూ వాయిదా పడటానికి అతడే ప్రధాన కారణమని గుప్తా ఆరోపించారు. అయినప్పటికీ ఈ విషయం పార్టీ అధ్యక్షురాలు సోనియాకు ఎప్పటికి చేరలేవన్నారు. అయితే ఇటీవల కాంగ్రెస్ పార్టీలో ప్రక్షాళన జరగాలని సోనియా గాంధీకి సినీయర్ నాయకులు లేఖ రాసిన విషయం తెలిసిందే.

# వాటర్ హీటర్ షాక్ తగిలి తల్లీబిడ్డల మృతి

కర్నూలు,డిసెంబర్19(ఆర్ఎన్ఎ): కర్నూలు జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. వాటర్ హీటర్ తగిలి ముగ్గురు మృతి చెందిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. కర్నూలు జిల్లా హాలహర్వి మండలం గుల్యంలో జరిగిన ఈ ఘటనతో ఆ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. వాటర్ హీటర్ తగిలి తల్లి సవిత (35), కుమారులు వెంకటసాయిముని (8), సర్చల్ కుమార్ (11) అక్కడికక్కడే మృతిచెందారు. తల్లీకొడుకుల మృతితో గ్రామంలో విషాదం నెలకొంది.

# ఎన్నికల నాటికి మిగిలేది ఆమె ఒక్కరే: అమిత్ షా

కోల్‌కత, డిసెంబం 19: పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల అనంతరం అక్కడ బీజేపీదే అధికారమని కేంద్ర హోంమంత్రి, బీజేపీ సీనియర్ నేత అమిత్ షా వ్యాఖ్యానించారు. దాదాపు 200కు పైగా సీట్లతో తాము బెంగాల్‌లో అధికారం చేపడుతామని ఆయన పేర్కొన్నారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం ఇవాళ పశ్చిమబెంగాల్‌కు వెళ్లిన అమిత్ షా.. తొలిరోజు పశ్చిమ మిడ్నాపూర్‌లో జరిగిన ఎన్నికల బహిరంగ సభకు హాజరయ్యారు. ఈ సందర్భంగా 11 మంది టీఎంసీ ఎమ్మెల్యేలు, ఒక ఎంపీ, మరో మాజీ ఎంపీతోపాటు ఇతర పార్టీల నుంచి కూడా పలువురు నేతలు బీజేపీలో చేరారు.

అనంతరం సభ హాజరైన ప్రజలను ఉద్దేశించి మాట్లాడిన అమిత్ షా.. తృణమూల్ సీనియర్ నాయకులు ఒక్కొక్కరుగా ఆ పార్టీని వీడి బీజేపీలో చేరుతున్నారని చెప్పారు. తమ పార్టీలో చేరికలు పెరుగుతుండటంతో బీజేపీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నదని మమతా దీదీ ఆరోపిస్తున్నారని, మరి ఆమె సొంత పార్టీ పెట్టుకోవడం కోసం కాంగ్రెస్ పార్టీ నుంచి ఫిరాయించలేదా అని ప్రశ్నించలేదా అని షా ప్రశ్నించారు. ఇది ఆరంభం మాత్రమేనని, ఎన్నికల నాటికి తృణమూల్ కాంగ్రెస్ ఆమె ఒక్కరే మిగులుతారని ఆయన వ్యాఖ్యానించారు. మీరు బెంగాల్ మూడు దశాబ్దాలపాటు కాంగ్రెస్ చేతిలో పెట్టారు. ఆ తర్వాత 27 ఏండ్లు కమ్యూనిస్టులకు అప్పగించారు. గత పదేండ్లుగా మమతా దీదీకి అధికారం ఇచ్చారు. ఎవరు అధికారంలో ఉన్నా రాష్ట్రం తలరాత మారలేదు. కానీ, ఒక్క ఐదేండ్లు బెంగాల్‌లో అధికారాన్ని బీజేపీకి ఇవ్వండి. మేం రాష్ట్రాన్ని బంగారు బెంగాల్‌లా మార్చి చూపిస్తాం అని ఓటర్లను అమిత్ షా కోరారు.

# అభివృద్ధి పథంలో తెలంగాణ : నిరంజన్‌రెడ్డి

ఆదిలాబాద్,డిసెంబం 19:: తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఆవిర్భావం తర్వాత అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకెళుందని వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో నిర్మల్ మండలం చిట్యాలలో నిర్మించిన రైతు వేదికను మంత్రులు నిరంజన్ రెడ్డి, ఇంద్రకరణ్ రెడ్డి, రైతు సమన్వయ సమితి రాష్ట్ర చైర్మన్ పల్లా రాజేశ్వర్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో జీవ వైవిధ్యం పునర్జీవం పోసుకుందని, టీఆర్ఎస్ సర్కారు తీసుకుంటున్న అనేక చర్యలతో అంతరించిపోతున్న పశుపక్ష్యాదులు మళ్లీ కనిపిస్తున్నాయన్నారు. రైతుల ఆత్మహత్యలు లేవని, దుఃఖం నుంచి దూరమయ్యామని, 60 ఏండ్ల కష్టాల నుంచి ఆరేండ్ల కాలంలోనే బయటపడగలిగామన్నారు. సాగునీటి ప్రాజెక్టులు పూర్తికావడంతో కష్టాల నుంచి గట్టెక్కామని, కోటికిపైగా ఎకరాలకు నీరు అందిస్తున్నామన్నారు. సీఎం కేసీఆర్ చేపట్టిన రైతు సంక్షేమ కార్యక్రమాలతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మెరుగైందని చెప్పారు. మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న నూతన వ్యసాయ చట్టాలతో రైతులు నష్టపోతున్నారన్నారు. చట్టాలతో వ్యవసాయ ఉత్పత్తులపై రైతులకు నియంత్రణ ఉండదని, రైతులు వ్యాపారులపై ఆధారపడాల్సిన దుస్థితి దాపురించిందన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని అని ఆ పార్టీ నేతలను ప్రశ్నించారు. రాష్ట్రాల నుంచి పన్నులను వసూలు చేస్తూ.. అదే నిధులను రాష్ట్రాలకు ఇస్తుంది తప్ప.. వాళ్ల జేబుల నుంచి ఇస్తున్నారా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. బాగుపడుతున్న తెలంగాణలోని బీజేపీని రానిస్తే.. భవిష్యత్తు అంధకారం అవుతుందన్నారు.

# త్వరలోనే మహబూబాబాద్‌కు మంత్రి కేటీఆర్!

హైదరాబాద్, డిసెంబం 19: త్వరలోనే మహా బూబాబాద్ నియోజక వర్గంలో మంత్రి కేటీఆర్ పర్యటిస్తారని టీఆర్ఎస్ ఎమ్మెల్యే శంకర్ నాయక్ తెలిపారు. ప్రగతి భవన్‌లో మంత్రి కేటీఆర్‌ను ఎమ్మెల్యే శంకర్ నాయక్ దంపతులు మర్యాదపూర్వకంగా కలిసి.. నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవానికి రావాలని ఆహ్వానించారు. మహబూబాబాద్ పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న టీఆర్ఎస్ పార్టీ కార్యాలయం ప్రారంభానికి, రూ. 5 కోట్ల వ్యయంతో మోడల్ మార్కెట్ శంకుస్థాపన కార్యక్రమానికి హాజరుకావాలని కేటీఆర్‌ను ఎమ్మెల్యే కోరారు. ఇక నియోజకవర్గం అభివృద్ధిపై కూడా కేటీఆర్ ఆరా తీశారు. నియోజక వర్గ అభివృద్ధికి అన్ని విధాలా అండగా ఉంటామని కేటీఆర్ భరోసానిచ్చారు.

# ఇల్లుకూలిన పేదను ఆదుకున్న మంత్రి

## ఆర్థిక సాయం అందించి అండగా నిలిచిన హరీష్ రావు

సిద్దిపేట,డిసెంబర్19(ఆర్ఎన్ఎ): ఇళ్లు కూలి నిరాశ్రయులైన ఆడబిడ్డలకు రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి హరీశ్ రావు అండగా నిలిచారు. చిన్నకోడూర్ మండలం రామంచ గ్రామంలో ఇటీవల కురిసిన వర్షాలకు దొంతరబోయిన బాలమణికి చెందిన ఇల్లు కూలిపోయింది. దీంతో తల్లి, కూతురు స్రవంతి నిరాశ్రయు లయ్యారు. 8 ఏళ్ల కిందటే తండ్రి రాజయ్య గుండెపోటుతో మృతి చెందాడు. ఆర్థికంగా చితికిపోయి కొట్టుమిట్టాడే ఇంట్లో పెండ్లి ఈడుకొచ్చిన ఆడపిల్ల స్రవంతి మేకలు, బర్లు కాపు కాస్తూ ఇళ్లు నెట్టుకొస్తుంది. కుటుంబ దీనస్థితి తెలిసిన మంత్రి హరీశ్ వెంటనే స్పందించారు. పెద్దదిక్కు లేని పేదరికంలో ఉన్న ఇంటికి అన్నలా అండగా నిలిచారు. కూలిన ఇళ్లు చోట మరమ్మత్తులు చేయించి కొత్త ఇల్లు కట్టించారు.

## చరిత్రలో నేటినిజం

కం॥ ఆమనివవె - భువిలో సుర
భామినివవె - భరతనాట్య భంగిమవోవె
కామినివవె - కామనలవె
"యామిని" వెలుగొందు హృదయమయిన కైనన్॥

(డిసెంబర్ 20 యామినీ కృష్ణమూర్తి పుట్టినరోజు..)

-రాధశ్రీ
సెల్: 9494481210


ఆహ్వానము

జివిఆర్ ఆరాధన కల్చరల్ ఫౌండేషన్

" దాదాసాహెబ్ ఫాల్కే " & పద్మవిభూషణ్ పురస్కారాల స్వీకర్త

డా॥ అక్కినేని నాగేశ్వరరావు గారి
97వ జయంతి వేడుకలు
2020 జివిఆర్ ఆరాధన
డా॥ అక్కినేని నగదు పురస్కారాల ప్రదానోత్సవం

ముఖ్యఅతిథి : డా॥ కె.వి. రమణ, ఐ.ఏ.ఎస్. (ర). తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు
సభాధ్యక్షులు : లయన్ డా. చిల్లా రాజశేఖరరెడ్డి స్థాపకులు, లయన్స్‌క్లబ్ ఆఫ్ గాంధీనగర్ ఆర్డ్, హైదరాబాద్
సభాప్రారంభం : శ్రీ సి. రామకృష్ణ పూర్వ జనరల్ మేనేజర్, దక్షిణమధ్య రైల్వే
అతిథులకు జ్ఞాపికల బహూకరణ : డా॥ రామరాజా శ్రీనివాసరావు, అధ్యక్షులు ఎ.పి. టాక్స్ ప్రొఫెషనర్స్ & కన్సల్టెంట్స్ అసోసియేషన్, గుంటూరు
నగదు బహూకరణ : డా॥ రామ్‌తిలక్ చెరుకూరి ఇండియా & సింగపూర్ శాంతి రాయబారి
జ్యోతి ప్రజ్వలనం : లయన్ పి. జయప్రకాష్ రెడ్డి కోశాధికారులు
పురస్కార స్వీకర్తల స్వాగత సత్కారం : శ్రీ కొండపాక కృష్ణమాచార్య అధ్యక్షులు, శ్రీ వేద ధార్మిక సేవా సమితి
అతిథుల స్వాగత సత్కారం : డా॥ కె. వీరభోగ వసంతరాయలు సంఘసేవకులు

28-12-2020, సోమవారం, సా॥ 6.00 గంటలకు
శ్రీ త్యాగరాయ గానసభ, (ప్రధాన మందిరం) చిక్కడపల్లి, హైదరాబాద్.

లయన్ గుబిబండి వెంకటరెడ్డి చైర్మన్ | లయన్ పి.వి. రామారెడ్డి ప్రధాన కార్యదర్శి | పెద్దూరి వెంకటదాసు సంయుక్త కార్యదర్శి

నేటినిజం
ఆదివారం 20-12-2020

# ఆందోళనకరంగా దేశ ఆర్థిక,సామాజిక పరిస్థితులు

మోడీ అధికారంలోకి వచ్చాక కేవలం కార్పోరేట్ శక్తులు బలపడుతున్న తీరు ప్రజలను కలచి వేస్తోంది. అలాగని కార్పోరేట్ సంస్థలు పెద్ద ఎత్తున ఉద్యోగ నియామకాలు చేపట్టినా ఊరట కలిగించేది. అయితే దేశీయంగా బలపడుతున్న వివిద కంపెనీలు ఆ మేరకు నిరుద్యోగ సమస్యను తీర్చే విషయంలో మాత్రం పెద్దగా ముందుకు రావడం లేదు. అంబానీ,ఆదానీలు బలపడడం యంచిదే అయినా నిరుద్యోగులకు అవకాశాల కల్పించడంలో మాత్రం అంతగా చొరవ తీసుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. దేశ కంపెనీలు ఎంతగా బలపడితే అంత మంచిది. కానీ అలా జరగడం లేదన్న విమర్శలు ఉన్నాయి. దేశీయ కంపెనీలు లాభాలపై ఉన్న దృష్టిని ప్రజలను ఆదుకోవడంపై పెట్టడం లేదు. విదేశీ కంపెనీల్లాగనే అవి

కూడా అరకొరగా నియామకాలు చేస్తున్నాయి. దివంగత మాజీప్రధాని పివి నరసింహారావు పుణ్యమా అని ఆయన ప్రవేశ పెట్టిన సంస్కరణలు దేశ ప్రజలను గడపదాటి బయటకు వెళ్లేలా చేశాయి. ప్రజలు ప్రపంచాన్ని చూసేలా చేశాయి. ప్రపంచం భారత్ వైపు చేశాయి. మన మార్కెట్లు జోరందుకున్నాయి. సరళీకృత ఆర్తిక విధానాలు సామాన్యుడికి కడుపునిండా భోజనం పెట్టేలా చేశాయి. ప్రతి వస్తువును కొనుగోలు చేసేలా చేశాయి. కానీ మోడీ అనుసరిస్తున్న ఆర్థిక విధానాలు ప్రజల నడ్డి విరిచేలా చేస్తున్నాయి. అయినా కిందిస్థాయిలో ఏం జరుగుతందో తెలుసుకోలేని ప్రధాని మోడీ కేవలం తాను అనుసరించిన ఆర్థిక విధానాలను ప్రజలు ఆమోదించారంటూ చెప్పుకోవడం ఆత్మవంచన తప్ప మరోటి కాదు. సంస్కరణలు ప్రజలు ఆమోదిస్తే, ప్రజలు బాగుపడితే ఆర్థిక పరిస్థితి దిగజారిపోదు. అలాగే జిడిపి పడిపోదు. కరోనా దెబ్బతో అన్ని రంగాలు బాగా క్షీణించాయి. అయితే లక్షల కోట్లు ప్యాకేజీలు ప్రకటించినా ప్రజలు కోలు కోలేని దుస్థితి ఇంకా కొనసాగుతూనే ఉంది. ఆర్థికవేత్తల హెచ్చరికలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్న విమర్శలు కూడా ఉన్నాయి. వ్యవసాయ చట్టాలు మేలుచేసేవే అయితే ప్రచారం ఉధృతంగా చేయాలి. ఏ రకంగా అవ ప్రయోజనం చేస్తున్నాయో తెలియచేయాలి. రైతులు .ఎందుకు రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలుపుతున్నారో గమనించాలి. ఇకపోతే జిఎస్టీ మొదలు, నోట్ల రద్దు వరకు పేద,సామాన్య ప్రజలు ఎంతగా చితకి పోతున్నారో గమనించడం లేదు.

జిఎస్టీ కారణంగా వస్తువల ధరలు పెరిగితే ఎవరికి నష్టమో ఎందుకు ఆలోచన చేయడం లేదు. దేనిని వదలకుండా జిఎస్టీ పరిధిలోకి తీసుకుని వచ్చినంత మాత్రాన, ప్రభుత్వ ఆదాయం పెరిగినంత మాత్రాన ఆర్థిక సంస్కరణలు భేషుగ్గా ఉన్నాయంటే ఎవరిని వంచించడానికి అన్నది ఆలోచన చేయాలి. ప్రజా నాయకులైతే.ప్రజాసేవే పరమార్థమైతే ఇలాంటి విధానాలు పరిశీలన చేసుకోవాలి. ప్రజలకు గుజరాత్ మోడల్ అంటూ ప్రచారం చేసి, ప్రధాని పదవిని చేపట్టిన మోడీపై ప్రజలకు విశ్వాసం ఉంటే ఆర్థిక ఫలితాలు ఇంత అధ్వాన్నంగా ఎందుకు ఉంటాయి. ప్రజల్లో నివురుగప్పిన అసంతృప్తిని గమనించి సర్దుకోకపోతే బిచాణా ఎత్తేయాల్సి ఉంటుందని పాలకులు గుర్తు చేసుకోవాలి. ప్రజల్లో గూడుకట్టుకున్న అసంతృప్తిని తొలగించలేకపోతున్నామని గమనించాలి. ప్రధాని మోడీ ఛరిష్మా, పాలనా సంస్కరణలు బాగా ఉంటే ఆర్థిక పురోగతి ఎందుకు సాధ్యం కావడం లేదో సమాధానం ఇచ్చు కోవాలి. కేవలం రాహుల్‌ను, కాంగ్రెస్‌ను తిట్టిపోస్తూ రాజకీయం చేయడమే పాలన కాదు. పాలనలో కొత్త ఒరవడి సృష్టించాలి.

ప్రజలకు మేలు జరిగేల సంస్కరణలు ఉండాలి. నిరుద్యోగులకు ఉద్యోగాలు రావాలి. ఆహారధాన్యాల ధరలు తగ్గాలి. సంస్కరణలంటే ఇవే తప్ప మరోటి కాదని గుర్తుంచుకోవాలి. 2014లో మోడీ

అధికారంలోకి వచ్చిన తరవాత ధరలను, నేటి మార్కెట్ ధరలను ఎందుకు బేరీజు వేసుకోవడం లేదో ప్రధాని మోడీ ప్రజలకు సమాధానం చెప్పాలి. కాంగ్రెస్ పార్టీ బలహీనంగా ఉన్నందున అది తమ బలంగా

చూడరాదు. ఆయా రాష్ట్రాల్లో పాగా వేసేందుకు వేస్తున్న ఎత్తుల్లో కొచెం అయినా దేశం గురించి ఆలోచిస్తే మంచిది. కాంగ్రెస్,తదితర పార్టీలు ఇప్పటికే జతకట్టి పనిచేస్తున్నాయి. వ్యవసాయ చట్టాలను ఆసరా చేసుకుని పోరాడుతున్నాయి. వచ్చే ఎన్నికల్లో రెట్టించిన ఉత్సాహంతో పనిచేస్తాయనడానికి ప్రస్తుత పరిస్థితులు, మోడీ విధానాలే కారణమవుతాయని గుర్తుంచుకోవాలి. తాము ప్రవచిస్తున్న సంస్కరణలు ఎక్కడ దారితప్పాయో గమనించాలి. పివి నరసింహారావు లాగా సంస్కరణలు ప్రజలకు ఎందుకు మేలు చేయలేకపోతున్నాయో పరిశీలన చేయాలి. ఆయా రాష్ట్రాల్లో గెలిచామన్న ధీమాను విడనాడాలి. ఇప్పటికైనా నోట్లరద్దు,జిఎస్టీ విపరిణామాలను విశ్లేషించుకోవాలి. విమర్శలను హెచ్చరికగా తీసుకుని ముందుకు సాగితే తప్ప మనలేమని మిత్రద్వయం గుర్తించి ప్రజలకు మేలుచేసే సంస్కరణలను అమలు

చేయాలి. అప్పుడే బిజెపి తన అస్తిత్వాన్ని నిలుపుకోగలదు. లేకుంటే 19 రాష్ట్రాల్లో అధికారంలో ఉన్నామన్న అహంకారంతో ఉంటే అది ఆవిరి కావడానికి ఎంతో సమయం పట్టదు. ప్రధాని మోడీ, పార్టీ జాతీయాధ్యక్షుడు అమిత్‌షాలకు గుజరాత్ సొంత రాష్ట్రం కావడం, దేశవ్యాప్తంగా అనేకచోట్ల వారు గుజరాత్ నమూనా గురించే ఘనంగా చెబుతూ రావడంతో సహజంగానే అన్ని వర్గాల దృష్టీ పడింది. అదే వారిని అధికారంలోకి తీసుకుని వచ్చింది.

కరోనా అనంతర పరిస్థితులు విపక్ష శక్తులన్నింటికీ ప్రాణం పోస్తోంది. శిసేన ఇప్పటికే కత్తులు నూరుతోంది. గత సార్వత్రిక ఎన్నికలు నల్లేరు మీద నడక కావడంతో బీజేపీ విజయోత్సాహానికి పట్టపగ్గాలు లేకుండా పోతున్నాయి. ప్రధానిగా మోడీ అనుసరించిన విధానాలు కూడా ప్రజలకు రుచించక పోవడంతో ప్రజల్లో తీవ్ర అసంతృప్తి గూడుట్టుకుని ఉంది. బీజేపీ మీద ఎంత వ్యతిరేకత ఉన్నా కాంగ్రెస్‌ను ఇప్పటికీ నమ్మలేకపోవడం కూడా మోడీకి కలసి వస్తోంది.వ్యవసాయ విధ్వంసం, దళితులపై దాడులు, రిజర్వేషన్ల ఉద్యమం వంటివి గ్రామీణ ప్రాంతాల్లో ప్రభావితం చేయడంతో కాంగ్రెస్ బలం పెంచుకోగలిగి పరిస్థితులు ఉన్నాయి. ఇప్పటికైనా కేంద్రం తన ఆర్థిక విధానాలను సరళీకరించాలి. జిఎస్టీ భారంతో ఇబ్బంది పడుతున్న రంగాలను గుర్తించాలి. రుణ ఎగవేత దారులను పట్టుకుని శిక్షించాలి. పరిశ్రమలకు ప్రోత్సాహం ఇస్తూనే వ్యవసాయాధారిత పరిశ్రమలను పెద్ద ఎత్తున ప్రోత్సహించాలి. నిరుద్యోగ సమస్యకు దారి వెతకాలి. వారిలో మరింత అభద్రతా భావం పెరగకుండా చూడాలి.

## జిల్లాలను ఓడిఎఫ్‌గా చేయాలి

జనగామ,డిసెంబర్19(ఆర్ఎన్ఎ): జిల్లాను ఓడీఎఫ్‌గా మార్చేందుకు సర్పంచ్‌లు కృషి చేయాలని పంచాయితీరాజ్ శాఖ అధికారులు కోరారు. ఈనెల 31లో ఇంటింటికీ మరుగుదొడ్డి నిర్మాణం లక్ష్యాన్ని చేరేలా అధికారులు పనిచేయాలన్నారు. లక్ష్యాన్ని చేరుకోవడంలో అలసత్వం వహించే అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. జిల్లాను ఓడీఎఫ్‌గా తీర్చిదిద్దే క్రమంలో నిర్లక్ష్యం వహించే అధికారులను ఉపేక్షించేదిలేదన్నారు. లక్ష్యాన్ని చేరుకునేందుకు కృషిచేయాలని, మరుగుదొడ్లకు కొత్తగా మంజూరు కావాల్సిన నిధులకు సంబంధించిన వివరాలు పంపించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని గ్రామ ప్రత్యేక అధికారులు శ్రద్ధ చూపాలని ఆదేశించారు.

## ఆదివాసీ గ్రామాల్లో దారికొస్తున్న పరిస్థితులు

### -ఇటీవలి కూంబింగ్‌లతో సర్వత్రా ఆందోళన

ఆదిలాబాద్,డిసెంబర్19(ఆర్ఎన్ఎ): ఆదిలాబాద్ జిల్లాలో ఇటీవలి ఘటనల తరవాత పరిస్థితులు దారికొస్తున్నాయిన పోలీసులు గ్రామాల్లో పికెట్లు ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నారు. ప్రజలు అనవసర పుకార్లతో రెచ్చిపోవద్దని సూచిస్తున్నారు. ఆందోళనల్లో మావోయిస్టులు రంగప్రవేశంచేసే అవకాశం ఉందని జిల్లా పర్యటనకు వచ్చిన డీజీపీ అనుమానం వ్యక్తంచేసారు. స్థానిక నేతలు కూడా ప్రజలను చైతన్యం చేస్తున్నారు. ఇరువర్గాలు సంయమనం పాటించాలని సూచిస్తున్నారు. శాంతియుతంగా జరిగే కార్యక్రమాలను రెచ్చగొట్టేలా చేసే ధోరణిని విడనాడాలని కోరారు. ఘర్షణలు జరగకుండా శాంతియుత పరిస్థితులు నెలకొనేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని తెలిపారు. గిరిజన ప్రజలకు భరోసానిస్తూ, శాంతి భద్రతలను పరిరక్షిస్తామని పోలీస్ అధికారుల అన్నారు. రెండు వర్గాల సమాజ పెద్దలతో పోలీసు సీనియర్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు చర్చలు జరుపుతున్నారు. ఇరు వర్గాల్లో సామరస్యత కోసం ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు తండాలకు, గూడాలకు వెళ్లి యువతతో మాట్లాడి భయభ్రాంతులకు గురయ్యే అవసరం లేదని భరోసా ఇచ్చారు.రక్షణ కల్పిస్తామని ధైర్యాన్ని ఇస్తున్నారు. ఆయా వర్గాల యువత సంయమనంతో ఉండాలని కౌన్సెలింగ్ చేస్తున్నారు. గ్రామాల్లో అపరిచితులు, అనుమానం కలిగి ఉన్న వ్యక్తులు సంచరిస్తూ హింసకు పాల్పడితే వారి ఫొటోలు తీసి వెంటనే ఎస్ఐకి సమాచారం ఇవ్వాలని కోరారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. భయభ్రాంతులకు లోనవకుండా ఉండాలని ఆయన ఇరు వర్గాలను కోరారు. గ్రామాల్లో ఏమైనా సమాచారం అందితే వెంటనే మాకు తెలిపితే వెంటనే పోలీసు బలగాలు ఆ గ్రామాలకు చేరి రక్షణ కల్పిస్తాయన్నారు.

జిల్లాలో జరుగుతున్న సంఘటనలు చాలా బాధాకరమని చెప్పారు. ఇరువర్గాలు సంయమనం పాటించాలని రెండు చేతులు జోడించి విజ్ఞప్తి చేశారు. ఆదివాసీ సంఘాలతో ఇది వరకే తాను పలుమార్లు చర్చించినట్లు వివరించారు.

## ఎన్‌కౌంటర్లు ఉండవని చెప్పి ఇలా చేస్తారా?

భద్రాచలం,డిసెంబర్19(ఆర్ఎన్ఎ): ఎన్‌కౌంటర్లు ఉండవని చెప్పిన తెలంగాణ ప్రభుత్వంలో మళ్లీ తుపాకుల మోతలతో భయభ్రాంతులకు గురి చేస్తున్నారని సిపిఎం జిల్లా నాయకులు అన్నారు. దామోదర్ కోసం గాలింపులతో గ్రామాల్లో ప్రజలు ఆందోళనలకు గురవుతున్నారు. అబద్దపు మాటలతో అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యమాలు, పోరాటాలు, ఎన్‌కౌంటర్లు ఉండవని కేసీఆర్ హామీ ఇచ్చారన్నారు. కానీ ప్రభుత్వం నిత్యం తన అబద్దాల మాటలతోనే కేసీఆర్ పాలన సాగిస్తున్నారని దుయ్యబట్టారు. ఆకలి చావులు, ఆత్మహత్యలు లేని సామాజిక తెలంగాణ కోసం సీపీఎం భవిష్యత్ పోరాటాలు సాగిస్తుందని అన్నారు. కెసిఆర్ అనుసరిస్తున్న తీరు దారుణంగా ఉందన్నారు. తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో 3,500 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని పేర్కొన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తానని చెప్పిన సీఎం మాట తప్పారని అన్నారు. తెలంగాణ సంపదకు కాపలాదారుగా ఉంటానని చెప్పిన ముఖ్యమంత్రి రాష్ట్ర సంపదను పెట్టుబడి, భూస్వామ్యవర్గాలకు దోచిపెడుతున్నారని ఆరోపించారు. దళితున్ని ముఖ్యమంత్రిని చేస్తానన్న కేసీఆర్ ఆ దళితులకు మూడెకరాల భూమి పంపిణీ చేయకుండా నిలువునా మోసం చేశారని ఆరోపించారు. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ పనుల్లో రూ.లక్షల కోట్ల దోపిడీ జరుగుదోందని ఆరోపించారు. ముఖ్యమంత్రి కుటుంబంలో ఆ నలుగురి లబ్ధి కోసమే ఈ పనులు సాగిస్తున్నారని ఆరోపించారు.

## ప్రత్యేక రాయలసీమకు బిజెపి వ్యతిరేకం

### సీమ ప్రాజెక్టులు పూర్తి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే

### పదివేల కోట్లతో పూర్తి చేయాల్సి ఉంది

### బిజెపి అధ్యక్షుడు సోము వీర్రాజు

కర్నూలు,డిసెంబర్19(ఆర్ఎన్ఎ): ప్రత్యేక రాయలసీమ ఉద్యమానికి తాము వ్యతిరేకమని, దానికి తమ మద్దతు ఉండదని బిజెపి ఎపి శాఖ ప్రకటించింది. ఇటీవల ప్రత్యేక రాయసలీమ పేరుతో వచ్చి ప్రకటనల నేపథ్యంలో పార్టీ అధ్యక్షుడు సోము వీర్రాజు స్పందించారు. భవిష్యత్తులో వైకాపా, తెదేపాతో భాజపా పొత్తు పెట్టుకోదని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు పేర్కొన్నారు. కర్నూలు నగరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 50 ఏళ్లుగా రాయలసీమకు అన్యాయం జరుగుతూనే ఉందన్నారు. అధికార పార్టీ, ప్రతిపక్షం రాయలసీమలోని ప్రాజెక్టులపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పోలవరం నిధుల కోసం కేంద్ర ప్రభుత్వాన్ని ఏ విధంగా ఒత్తిడి చేస్తుందో.. అలాగే రాయలసీమ ప్రాజెక్టుల విషయంలో ప్రణాళిక విడుదల చేయాలని సోము వీర్రాజు కోరారు. రూ.10 వేల కోట్ల నిధులతో రాయలసీమ ప్రాజెక్టులు పూర్తి చేయాలన్నారు. రాష్ట్రంలో బంగారం దొరుకుతుంది కానీ ఇసుక దొరకడంలేదని విమర్శించారు. జగన్ మూడు రాజధానులంటారని, చంద్రబాబు అమరావతి అంటారని, కర్నూలులో హైకోర్టు కడితే రాజధాని అయిపోతుందా? అని ప్రశ్నించారు. రాయలసీమకు నికర జలాలు ఇస్తామని నాలుగేళ్ల ముందే ప్రకటించామని, బిజెపికి అధికారం ఇస్తే రాయలసీమను రతనాల సీమగా మారుస్తామని తెలిపారు. గాలేరు నగరి, హంద్రీనీవా బిజెపి ఘనతేనన్నారు. రూ.100 కోట్లు, రూ.150 కోట్లతో సిద్ధేశ్వరం అలుగు కట్టేందుకు, సంగమేశ్వరం వంటి అనేక ప్రాజెక్టులు కట్టేందుకు అవకాశం ఉందా అని ప్రశ్నించారు. నంద్యాలలో నిర్మించనున్న వైద్య కళాశాలతో పాటు పలు పథకాలకు బిజెపి నిధులు ఇస్తోందని, చంద్రబాబు, జగన్ రాష్ట్రానికి సొంతంగా చేసింది ఏమీ లేదని అన్నారు.గత ప్రభుత్వ హయాంలో ఇసుక చౌకగా లభించిందని ప్రస్తుతం ఆ పరిస్థితి లేదన్నారు. ఇతర రాష్ట్రాల్లో లాగా ఎపిలో రాయలసీమలో ఒక సారి అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తే ఏమవుతుంద న్నారు.

# బిజెపిలో చేరికలపై కాంగ్రెస్ నేతలకు ఫోన్లు?

### సన్నిహితులతో మంతనాలు సాగిస్తున్న డికె అరుణ

హైదరాబాద్,డిసెంబర్19(ఆర్ఎన్ఎ): బీజేపీలో ఇటీవలి పరిణామాలతో ఇతర పార్టీల వారు చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఇందుకు పార్టీలోని వారు సైతం ప్రోత్సమిస్తున్నారు. ముఖ్యంగా బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ మాత్రం కాంగ్రెస్‌లో తనతో సన్నిహితంగా ఉన్న నాయకులను కాషాయ శిబిరంలోకి తీసుకొచ్చే ప్రయత్నాలు ముమ్మరం చేశారని సమాచారం. ఇందులో భాగంగా మాజీ మంత్రి జానారెడ్డి కుటుంబంతో టచ్‌లో ఉండడంతోనే ఇటీవల జానా కుటుంబం పార్టీలో చేరుతారంటూ ప్రచారం జరిగింది. అన్ని జిల్లాల్లోని కాంగ్రెస్ నాయకులకు డికె ఫోన్ చేసి మాట్లాడుతున్నారని సమాచారం. బిజెపికి ఉజ్వల భవిష్యత్ ఉందని, రాష్ట్రంలో తదుపరి అధికారం కూడా బిజెపిదే అని చెబుతున్నారు. ఇప్పుడు కాంగ్రెస్ నాయకులు ఇదే విషయమై చర్చించుకుంటున్నారు. తెలంగాణలో కాంగ్రెస్‌ను ఇంకా బలహీనం చేయాలనే ఏకైక అజెండాలతో పావులు కదుపుతున్నారాని ప్రత్యర్థులు ఆరోపిస్తున్నారు. అయితే కాంగ్రెస్‌లో ఉన్నా లాభం లేదనుకుంటున్న వారు త్వరగా పార్టీని వీడేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఇలాంటి వారిలో మాజీమంత్రి చంద్రశేఖర్, నిర్మల్‌కు చెందిన మహేశ్వర్ రెడ్డి, వరంగల్‌నుంచి కొండా దంపతులు కూడా ఉన్నారని సమాచారం. వీరందరిని పురమాయిస్తున్నది కూడా డికె అరుణ అని తెలుస్తోంది. పార్టీలో కీలక బాధ్యతలు పోషిస్తున్నందున ఆమె చేరికలపై దృష్టి పెట్టారని అంటున్నారు. తెలంగాణలో తమకు మంచిరోజులు వచ్చాయని బీజేపీ నాయకులు భావిస్తున్నారు. కాంగ్రెస్‌ను ఖాళీ చేసే పనిలో పడ్డారు. దుబ్బాక, గ్రేటర్ ఎన్నికల తర్వాత పార్టీ గ్రాఫ్ పెరగడంతో చాలా మంది కాంగ్రెస్ నాయకులు కమల నాథులతో టచ్‌లోకి వెళ్లారు. విజయశాంతి.. గూడూరు నారాయణరెడ్డి.. స్వామిగౌడ్ లాంటి వారు ఢిల్లీ వెళ్లి పార్టీ కండువా కప్పేసుకున్నారు. మరికొందరు క్యూలో ఉన్నారు. అయితే అందరినీ ఢిల్లీ తీసుకురావొద్దని హస్తిన నాయకులు సూచిస్తున్నారు. హైదరాబాద్ వేదికగా పార్టీలో చేరికలను చేప్పాలని సూచించారని సమాచారం. పార్టీలో చేరికలు ఏమైనా ఉంటే.. హైదరాబాద్ లేదా తెలంగాణ స్థాయిలోనే చూసుకోవాలని ఢిల్లీ పెద్దలు సూచించారని సమాచారం. ఇకపోతే బిజెపిలో చేరాలనుకుంటున్న మాజీ మంత్రి ఏ చంద్రశేఖర్ వికారాబాద్‌లోనే భారీసభ పెట్టి కాషాయ కండువా కప్పుకోవాలని నిర్ణయించినట్లు అనుయాయులు చెబుతున్నారు. మాజీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి సైతం నిర్మల్‌లో పెద్ద సభ పెట్టి జాయిన్ అవుతానని అన్నట్లు తెలుస్తోంది. ఇకపోతే కొండా దంపతులు కూడా పార్టీలో చేరాలా వద్దా అన్న ఆలోచనలో ఉన్నారు.

# పర్యావరణ విధ్వంసంతో నరకంగా నగరజీవనం

### చెట్లను రక్షిస్తేనే ముమ్ముందు ప్రశాంత వాతావరణం

హైదరాబాద్,డిసెంబర్19(ఆర్ఎన్ఎ): మానవాళికి చెట్లు చేసే మేలేమిటో తెలుసుకోవడానికి ఎవరూ గూగుల్‌ను ఆశ్రయించనవసరం లేదు. పర్యావరణవేత్తలు చెబితే తప్ప తెలియని వారెవరూ లేరు. చెట్ల ఉపయోగాల గురించి బడి చదువుల దగ్గరనుంచి గురువులు నూరిపోయడమే ఇందుకు కారణం. దురదృష్టమేమంటే అధికార పీఠాలపై ఉన్న నేతలు, ఉన్నతాధికార వర్గంలో పనిచేస్తున్నవారు ఏ బళ్లో చదువుకుని ఆ స్థాయికి ఎదిగారోగానీ... దేశంలో అభివృద్ధి పేరు చెప్పి వృక్ష సంహారం జరగని రోజంటూ దేశంలో ఉండటం లేదు. రాయలసీమలో అత్యంత విలువైన ఎర్రచందనం టన్నుల కొద్దీ తరలిపోవడానికి రాజకీయ నేతలే కారణం. పటిష్టమైన చర్యలు తీసుకున్నా స్మగ్లింగ్ ఆగడం లేదు. నరికివేతలు యథాతథంగానే సాగుతున్నాయి. నగరాల విస్తరణ కారణంగా వేలాదిగా చెట్లు విధ్వంసానికి గురవుతున్నాయి. ఎక్కడికక్కడ పర్యావరణ విధ్వంసంతో పీల్చుకునే గాలి కూడా కరువు అవుతోంది. ఢిల్లీలో ప్రమాదకర స్థాయిలో వాతావరణంలో కాలుష్యం నెలకొంది. నగరానికి ప్రాణవాయువును అందిస్తున్న వృక్షజాలాన్ని ధ్వంసం చేయాలా అని ప్రశ్నిస్తున్నారు. ప్రశాంతంగా స్వచ్ఛమైన వాయువు పీల్చి పునీతులు కావడానికి నగర వాసుల్లో అత్యధికులు ఎన్నుకునే పార్కులకు ప్రాధాన్యం పెరగాల్సి ఉంది. చెట్లనుంచి వీచే గాలిని ఆస్వాదిస్తూ వందలమంది ఇక్కడ సైక్లింగ్, జాగింగ్ చేస్తుంటారు. ముంబైతో సహా మన మహానగరాలు వేల కోట్లు ఆర్జించే పెట్టే బంగారు గనులే కావొచ్చు. అక్కడ అనేకులకు ఉపాధి దొరుకుతుండవచ్చు. కానీ వాటికి కావలసినంత అపకీర్తి కూడా ఉంది. అందులో అనేకం కాలుష్యకారకాలు. ప్రపంచంలో అత్యంత కాలుష్యభరిత నగరాలు 20 ఉంటే అందులో 15 మన నగరాలే! తీవ్ర ఉష్ణోగ్రతలతో అల్లాడుతున్న ప్రపంచంలోని 15 నగరాల్లో మన వాటా 11! ఈ నగరాల వాతావరణంలో, ఇక్కడి తాగునీటిలో మృత్యువు దాగుందని నిపుణులు చాన్నాళ్లుగా చెబుతున్నారు. నగర పౌరుల ఊపిరితిత్తుల్లోకి కొంచెం కొంచెంగా చొరబడుతున్న కాలుష్యం వారిని రోగగ్రస్తులుగా మారుస్తోంది. కేన్సర్, గుండె జబ్బులు వగైరాలకు కారణ మవుతోంది. అనేకుల్లో అకాల వృద్ధాప్యాన్ని కలిగిస్తోంది. వారిని పనిపాటలకు దూరం చేస్తోంది. ఇదంతా మన పాలకులకు ఆందోళన కలిగించాలి. దీన్ని సరిచేయడానికి అవసరమైన ప్రణాళికలు రూపొందించడానికి పురిగొల్పాలి.ప్రపంచ అధ్యయన సంస్థలు చెబుతున్న వాస్తవాలేవీ వారిలో కదలిక తీసుకురావడం లేదు.

ఇల్లు కట్టుకుందామనో, ఉన్న ఇంటిని విస్తరించుకుందామనో ఎవరైనా తమ ఆవరణలో చెట్లు కొట్టాలంటే అందుకు అనుమతులు తీసుకోవడం అవసరం. కానీ తమకు అలాంటి నిబంధనలు వర్తించవన్నట్టు ప్రతి ఒక్కరూ ప్రవర్తిస్తున్నారు.

# లేక్‌అవుట్‌పోస్ట్ పోలీసుల ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిభిరం

కరీంనగర్. డిసెంబర్ 1 (నేటినిజం ప్రతినిధి ):పోలీస్ కమిషనర్ విబి కమలానన్‌రెడ్డి ఆదేశాల మేరకు లేక్‌అవుట్‌పోస్టు పోలీసుల ఆధ్వర్యంలో శనివారం నాడు దిగువ మానేరు జలాశయం(ఎల్‌యండి)వద్ద కరీంనగర్‌లోని మెడికవర్ ఆసుపత్రి వారి సహకారంతో వైద్యశిభిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సందర్శకులు, వాకర్స్, సమీప ప్రాంతాలకు చెందిన 100 మందికి ఉచితంగా మధుమేహ, రక్తపోటు, వివిధ రకాల రక్తపరీక్షలను నిర్వహించారు.

వ్యాధులు గుర్తించబడిన వారికి ఆసుపత్రి వైద్యబృందం తగు జాగ్రత్తలు, సూచనలు తెలియజేయడంతోపాటు ఉచితంగా మందులను అందజేశారు. లేక్‌పోలీసులు అసాంఘీక కార్యకలాపాలను నియంత్రించే చర్యలను కొనసాగించడంతోపాటు పలు సేవాకార్యక్రమాలను నిర్వహించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో మెడికవర్ ఆసుపత్రి అడ్మినిస్ట్రేటవ్ అధికారి గుర్రం కిరణ్, లేక్ అవుట్‌పోస్ట్ ఆర్ఎస్ఐలు అమీదాబేగం, అర్షం సురేష్, కానిస్టేబుళ్ళు వెంకటరమణ, రవీందర్, శ్రీనివాస్, హెూంగార్డులు సౌందర్య, అన్వర్, స్వచ్ఛ భారత్ కార్యనిర్వాహకులు రాంప్రసాద్, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు రంగారావు, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

### పెండింగ్ వారెంట్ల అమలు పరారీలో ఉన్న ఇద్దరు నిందితుల అరెస్ట్

వివిధ రకాల కేసుల్లో నిందితులుగా ఉండి దీర్ఘకాలం నుండి పరారీలో ఉన్న ఇద్దరు నిందితులను శనివారంనాడు అరెస్ట్‌చేసి కోర్టులో హాజరుపరిచారు. వివరాలు ఇలాఉన్నాయి.

జమ్మికుంటకు చెందిన బొల్ల రమేష్(40) 2004మే 02న కేశవపట్నం మండలం మొలంగూరు వద్ద అతివేగం, నిర్లక్ష్యంగా కారునడుపుతూ మరోవాహనాన్ని ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో అదేమండలంలోని రాజాపూర్ గ్రామానికి చెందిన కుర్ర శ్రీను(25)మృతి చెందాడు. మరో ఇద్దరు గాయపడ్డారు. సంఘటన జరిగినప్పటి నుండి పరారీలో ఉన్నాడు. ఇతనిపై న్యాయస్థానం వారెంటును జారీచేసింది.

ఎస్ఐ వి రవి ఆధ్వర్యంలోని ప్రత్యేకబృందం గాలింపులు జరుపుతున్నారు. ప్రస్తుతం నిందితుడు బొల్ల రమేష్ హైదరాబాద్ సమీపంలోని ఘట్కేసర్ ప్రాంతంలో నివసిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఉదయం అతనిపై పెండింగ్‌లో ఉన్న వారెంట్‌ను అమలు చేసి అరెస్టు చేశారు. అనంతరం న్యాయస్థానంలో హాజరుపరిచారు.

పేకాట కేసులో నిందితుడిగా ఉండి తప్పించుకుని తిరుగుతున్న మరో నిందితుడిని శనివారంనాడు అరెస్టు చేశారు. 2017 అక్టోబర్ 12న కేశవపట్నం మండలంలోని లింగాపూర్‌లో పేకాడుతుండగా పోలీసులు దాడి జరిపారు. ఇందులో జమ్మికుంట మండలం కోరపల్లికి చెందిన టొంగుటూరి కుమారస్వామి పరారీలో ఉన్నాడు. ప్రస్తుతం భూపాలపల్లి జిల్లా కాటారంలో ఉంటున్నాడని సమాచారం అందుకున్న పోలీసులు శనివారం ఉదయం కాటారం మండలంలోని మద్దెలపల్లిలో అతనిపై పెండింగ్‌లో ఉన్న వారెంటును అమలుచేసి అరెస్టు చేశారు. అనంతరం కోర్టులో హాజరుపరిచారు.

పెండింగ్ వారెంట్ల అమలుకోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దీర్ఘకాలంగా తప్పించుకుని తిరుగుతున్న నిందితులను అరెస్టు చేసిన కేశవపట్నం పోలీసులను కరీంనగర్ పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి వారిని అభినందిస్తూ రివార్డులను ప్రకటించారు.

## కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలి

### ప్రాజెక్ట్‌తో తెలంగాణ రూపురేఖలు మారిపోతాయి

### మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్

భువనగిరి,డిసెంబర్19(ఆర్ఎన్ఎ): ఎపిలో పోలవరం లాగే కాళేశ్వరాన్ని జాతీయ ప్రాజెక్టుగా గుర్తించాలని భువనగిరి పార్లమెంటు మాజీ సభ్యుడు బూర నర్సయ్యగౌడ్ అన్నారు. విడిపోయాక అటు ఆంధ్ర, ఇటు తెలంగాణ రెండు రాష్ట్రాలు అభివృద్ధిలో పోటీపడి ముందుకు సాగుతున్నాయని తెలిపారు. తెలంగాణాలో అన్ని వర్గాల అభివృద్ధి వేగంగా సాగుతుందని, ధనిక, పేద అనే తేడాలేకుండా ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిఒక్క తెలంగాణ పౌరుడు తలెత్తుకొని బతికేందుకు కావాల్సిన అన్ని రకాల చర్యలు చేపడుతున్నారని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టును ఆపడానికి అనేక శక్తులు ప్రయత్నించాయని నర్సయ్య గౌడ్ అన్నారు. కాగా...కాళేశ్వరం ప్రాజెక్టుతో తెలంగాణ రూపు రేఖలు మారిపోతాయని అన్నారు. తెలంగాణలోని కాళేశ్వరం ప్

# పశుబీమాపై రైతుల్లో కానరాని చైతన్యం

## ప్రచారంతోనే మేలు అంటున్న అధికారులు

హైదరాబాద్,డిసెంబర్19(ఆర్ఎన్ఎ): పాడిరైతులను ప్రోత్సహిచేందుకు పాడి పశువులను కోల్పోయిన రైతులు నష్టపోకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా పశు బీమా పథకాన్ని అమల్లోకి తెచ్చాయి. పశువు ఏ కారణంతోనైనా మరణిస్తే దాని పూర్తి విలువను బీమా ద్వారా చెల్లించే విధంగా ఈ పథకాన్ని అమలు చేస్తున్నాయి. దీంతో గ్రామాల్లో దీనిపై ప్రచారం చేసి రైతులను చైతన్యం చేసేలా ప్రోత్సహించాలని పశు సంవర్ధక అధికారులకు ఆదేవాలు ఇచ్చారు. దేశవాళీ, సంకరజాతి ఆవులు, బర్రెల్లో చూలు పశువు అయినా, పాలిచ్చేదైనా, ఎండిపోయినదైనా, ఒకసారి ఈనని ప్రతి ఆవు, బర్రెకు ఈ పథకం వర్తిస్తుంది. పదేళ్లలోపు ఉండి ఐదు ఈతలకు మించని పశువులై ఉండాలని అధికారులు చెబుతున్నారు. మార్కెట్ విలువనుబట్టి 10వేల నుంచి 60వేల వరకు పశువులపై బీమా చేసుకోవచ్చని వారు స్పష్టం చేస్తున్నారు. పశును కోల్పోయినపుడు ఈ మొత్తాన్ని బీమా కంపెనీ ద్వారా పొందే అవకాశం ఉంటుంది. వ్యవసాయ అనుబంధంగా ఉన్న పాడి పరిశ్రమను ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలను అమలు చేస్తున్నాయి. ఇప్పటికే ఉన్న పశు సంపదతోపాటు ప్రభుత్వాలు వివిధ పథకాల ద్వారా సబ్సిడీపై అందిస్తున్న పాడి పశువులు పలు కారణాలతో మృత్యువాత పడడంతో రైతులు నష్టపోవాల్సి వస్తున్నది. ఇటీవలి కాలంలో బ్యాంకుల ద్వారా రుణం తీసుకొని పాడి పశువులు కొనుగోలు చేసుకుంటున్న రైతులకు పశు వైద్యాధికారులే ప్రీమియం నిలువుకొని రైతులకు అందిస్తున్నారు. ఈ పథకం కింద కేంద్ర ప్రభుత్వం 50 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 30 శాతం ప్రీమియం భరిస్తుంటే రైతులు మరో 20 శాతం మాత్రమే ప్రీమియం చెల్లించాల్సి ఉంది. దేశవాళీ, అధిక పాల ఉత్పత్తిని ఇచ్చే పాడి పశువులకు అవకాశం కల్పించారు. ఒక ఏడాదికి లేదా మూడేళ్ల కోసం బీమా సదుపాయం కల్పిస్తున్నారు. పాడి పశువులు ఉన్న ప్రతి వర్గం రైతులు ఈ బీమా పథకంలో చేరేందుకు అర్హులని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం విడుదల చేసిన మొత్తంలో 20 శాతం షెడ్యూలు కులాల రైతులు ఉండేలా చూడాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయి. ఈ పథకం అమల్లోకి వచ్చాక జిల్లాల్లో అనేక మంది రైతులు ప్రీమియం చెల్లించేందుకు ముందుకు వస్తున్నారని అధికారులు తెలిపారు. బీమా సదుపాయం రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో అమల్లో ఉంది. పశువులు

ప్రమాదాలకు గురైనా, వ్యాధుల బారినపడినా, ప్రకృతి వైపరీత్యాల వల్లనైనా మృత్యువాత పడితే బీమా వర్తిస్తుందని అధికారులు పేర్కొంటున్నారు. ఈ పథకం కింద ఏడాది పాటుగానీ, మూడేళ్లపాటుగానీ పశువులకు బీమా ప్రీమియం చెల్లించుకోవచ్చు. మూడేళ్ల కాలానికి ప్రీమియం చెల్లిస్తేనే రైతులకు లాభం ఉంటుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. బీమా కోసం రైతులు ప్రభుత్వ పశువైద్యశాల సిబ్బంది, డివిజన్, జిల్లాస్థాయి పశుసంవర్ధక అధికారులు, బీమా కంపెనీ, కార్యనిర్వాహక అధికారిని సంప్రదించాలని అధికారులు సూచిస్తున్నారు. బీమా చేసిన పశువును అమ్ముకోవాల్సి వస్తే కొనుగోలు చేసిన రైతుకు కూడా వర్తిస్తుందనీ, పశువు యూనిట్‌గా బీమా ప్రీమియం చెల్లింపు జరుగుతున్నట్లు అధికారులు వివరిస్తున్నారు. చాలా మంది రైతులకు పాడి ప్రధాన ఆదాయ వనరుగా మారింది. వేలకు వేలు వెచ్చించి రైతులు పశువులను కొనుగోలు చేసుకుంటున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా వివిధ వర్గాలకు చెందిన

రైతులకు రాయితీపై పాడి పశువులను అందించి ప్రోత్సహిస్తున్నాయి. ఇలా రైతులు సొంతంగా కొనుగోలు చేసుకున్నవిగానీ, రాయితీపై ఇచ్చినవిగానీ వివిధ కారణాలో మృత్యువాత పడితే రైతులు కోలుకోలేని పరిస్థితి ఏర్పడుతున్నది. తిరిగి పశువును కొనుగోలు చేయాలంటే రైతులు అప్పులు చేయాల్సి వస్తున్నది. పాడి రైతులు తమకున్న ఎన్ని పశువులకైనా బీమా చేసుకునే అవకాశం ఉంది. అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే ప్రీమియం రాయితీ మాత్రం ఒక రైతుకు చెందిన ఐదు పశువులకు మాత్రమే వర్తిస్తుందని అధికారులు చెబుతున్నారు.

# గోల్డెన్ అవర్‌లో ప్రాణాలు కాపాడాలి : సీఎస్ సోమేశ్ కుమార్

హైదరాబాద్,డిసెంబర్19(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో రహదారి భద్రతపై అన్ని జిల్లాల్లో తీసుకోవాల్సిన చర్యలపై కార్యాచరణ ప్రణాళిక రూపొందించాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఆర్అండ్‌బీ, పోలీసు, వైద్యారోగ్య శాఖ అధికారులతో సీఎస్ సమావేశ మయ్యారు. ప్రమాదాలు జరిగిన వెంటనే గోల్డెన్ అవర్‌లో అత్యవసర వైద్యాన్ని అందించేందుకు వీలుగా అంబులెన్స్ సేవలు, ఆసుపత్రులు, ట్రామా కేర్ సెంటర్ల అనుసంధాన ప్రణాళికపై సమావేశంలో ప్రధానంగా చర్చించారు. ట్రామా కేర్ కేంద్రాల్లో విధులు నిర్వర్తించే సిబ్బందికి నిమ్స్ ద్వారా ఎమర్జెన్సీ మెడిసిన్‌లో శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేయాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు జరిగిన వెంటనే రక్తస్రావాన్ని అరికట్టి మరణాలను తగ్గించేలా తీసుకునే చర్యలపై శిక్షణ ఇచ్చేందుకు అవసరమైన సిబ్బందిని గుర్తించాలని వైద్య, ఆరోగ్య శాఖ అధికారులకు సూచించారు. బాహ్యవలయ రహదారిపై ప్రమాదాలను తగ్గించేలా ఫెన్సింగ్, క్రాసింగ్స్ బోర్డుల ఏర్పాటు, విద్యుత్ దీపాలు, కెమెరా ఆధారిత వేగ నియంత్రణ తదితర అంశాలపై అధ్యయనం చేసేందుకు ఓ కమిటీని ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖ అధికారులను సీఎస్ ఆదేశించారు. సురక్షిత డ్రైవింగ్‌పై ప్రభుత్వ డ్రైవర్లకు ఒక రోజు శిక్షణ ఇవ్వాలని అధికారులను సీఎస్ సోమేశ్ కుమార్ ఆదేశించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు రాష్ట్రంలో రహదారి భద్రతపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ బీఆర్‌కే భవన్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అంబులెన్స్‌లు, ఆస్పత్రులు, ట్రామా కేర్ సెంటర్ల మ్యాపింగ్‌పై సమీక్షించారు. అన్ని జిల్లాలకు రహదారి భద్రతా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి అని ఆదేశించారు. రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలను తగ్గించడం, గో÷-డలెన్ అవర్‌లో వైద్యసాయం అందించి ప్రాణాలు కాపాడేలా చూడాలన్నారు. ట్రామా కేర్ సెంటర్లలోని సిబ్బందికి అత్యవసర వైద్యంపై శిక్షణ ఇవ్వాలన్నారు. ప్రమాదాల సందర్భంగా క్షతగాత్రుల మరణాల సంఖ్యను తగ్గించే నిమిత్తం ఈఎంఆర్ఐ ద్వారా అందించే యాక్టివ్ బ్లీడింగ్ కంట్రోల్‌పై మాస్టర్ శిక్షణ కోసం వైద్య శాఖ సిబ్బందిని గుర్తించాలని ఆదేశించారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో ఏఎన్‌పీఆర్ కెమెరాల ద్వారా వేగ నియంత్రణ, పర్యవేక్షణతో పాటు తదితర అంశాలను అధ్యయనం చేసేందుకు ఓ కమిటీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సురక్షిత డ్రైవింగ్‌పై ప్రభుత్వ డ్రైవర్లకు ఒకరోజు శిక్షణ ఇవ్వాలి. ఇందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను సోమేశ్ కుమార్ ఆదేశించారు. ఈ సమావేశంలో రవాణా, రోడ్లు, భవనాల శాఖ ముఖ్య కార్యదర్శి సునీల్ శర్మ, అడిషనల్ డిజి జితేందర్, హోంశాఖ ముఖ్య కార్యదర్శి రవిగుప్తా, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి రిజ్వీ, సందీప్ శాండిల్య, రవాణా శాఖ కమిషనర్ యంఆర్‌యం రావు, బీ విజేంద్రా, ప్రత్యేక కార్యదర్శి సంతోష్ పిడి, ఓఆర్ఆర్, తదితర అధికారులు పాల్గొన్నారు.

# అడవుల రక్షణకు కఠిన నిర్ణయాలు

## వేసవిలో అడవుల్లో మంటలు రాకుండా చర్యలు

భద్రాద్రి కొత్తగూడెం,డిసెంబర్19 (ఆర్ఎన్ఎ): రిజర్వ్ ఫారెస్ట్ రక్షణకు అధికారులు నడుం బిగించారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఉన్నతాధికారులు పలు సూచనలు చేశారు. దీంతో అడవుల పరిరక్షణకు ముందుగా రిజర్వ్ ఫారెస్టు ప్రాంతాన్ని విభజిస్తూ ట్రెంచ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. అడవుల్లో మంటలు విస్తరించకుండా ప్రత్యే కంగా ఫైర్లైన్స్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అటవీ హక్కు పత్రాలు లేని పోడు భూములను ఈ వేసవిలోపు స్వాధీనం చేసకుంటామని కూడా అధికారులు స్పష్టం చేశారు. ఇప్పటికే అటవీ అధికారులు కఠినంగా ఉండడంతో అటు గిరిజనులు, ఇటు ఎమ్మెల్యే రేగా కాంతా రావు లాంటి వారు ఆగ్రహంగ ఆఉన్నారు. మరోవైపు జిల్లాలోని అటవీ ప్రాంతంలో నిప్పు పెట్టడాన్ని ఇకమీదట సహించబోమని, రిజర్వ్ ఫారెస్టు యాక్ట్ పరిధిలో కఠిన చర్యలు తీసు కుంటామని అధికారులు స్పష్టం చేశారు. గడిచిన కొన్నేళ్ళుగా జిల్లా వ్యాప్తంగా ప్రతి ఏటా వేసవి ప్రారంభంలో రిజర్వ్ ఫారెస్టు పరిధిలోని ఒకే ప్రాంతంలో మంటలు చెలరేగుతున్నట్లు గూగుల్ ద్వారా కేంద్ర ప్రభుత్వం గుర్తిం చింది.. ఇల్లెందు ఫారెస్టు డివిజన్‌లో 252 కంపార్ట్‌మెంట్లు ఉండగా అందులో 23 కంపార్ట్ మెంట్లలో ప్రతి ఏటా మంటలు చెలరేగుతున్నట్లు కేంద్ర ప్రభుత్వ నిఘాలో వెల్లడైందని అధికారులు పేర్కొన్నారు. ముఖ్య ంగా రిజర్వ్ ఫారెస్టు ప్రాంతంలో సాగు చేసుకుంటున్న రైతులు మొక్కజొన్న చెత్తను తరగలబెట్టడం వల్ల మంటలు అడ విలోకి విస్తరించి అడవికి నష్టం చేకూరుతందు న్నారు. ఇంతేకాకుండా బీడీ ఆకుల సేకరణ సందర్భంగా అడవికి మంటలు పెడుతున్నట్లు గుర్తించామన్నారు. ఇప్పుడిప్పుడే పెరుగు తున్న మొక్కలకు వేసవిలో పెట్టే మంటల వల్ల నష్టం చేకూరుతుందని, రక్షణ కోసం ఎప్పటికప్పుడు అప్రమతంగా ఉండాలని అటవీ సిబ్బందిని ఆదేశించారు. ఈ క్రమంలో నే కేంద్ర ప్రభుత్వ నివేదిక ఆధారంగా అడవుల రక్షణకు ఎటువంటి చర్యలు తీసుకుంటు న్నారని సుప్రీంకోర్టు ప్రశ్నించిందని గుర్తుచేశారు. బీడీ ఆకు సేకరణ పేరుతో అడివికి నిప్పు పెడుతున్నం దున వణ్యప్రాణులు అధికంగా ఉన్న కిన్నెరసాని వైల్డ్‌లైఫ్ అటవీ ప్రాంతంలో మినహా జిల్లా వ్యాప్తంగా అడవుల్లో ఆకు సేక రణకు అనుమతి ఇచ్చామన్నారు. ఆకు సేకరణ కోసం అడ వికి నిప్పు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చ రించారు. రాన్నున్న కాలంలో అడవులకు మంటలు పెట్టడం వల్ల జరిగే నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు.

# భాజపాతోనే అభివృద్ధి సాధ్యం

కరీంనగర్,డిసెంబర్19(ఆర్ఎన్ఎ): దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే అది భాజపాతోనే సాధ్యమవుతుందని, ఇప్పటికే మోదీ ఆధ్వర్యంలో భారత్ అన్ని రంగాలవైపు దూసుకెళ్తూ ప్రపంచం దృష్టికి ఆకర్షిస్తుందని బీజేపి నాయకుడు,మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయం అన్నారు. దేశంలో భాజపా సాధిస్తున్న వరుస విజయాలతో కాంగ్రెస్ ముక్త్ భారత్ వైపు వడివడిగా అడుగులు పడుతున్నాయని తెలిపారు. వ్యవసాయ చట్టాలను ప్రతిపక్షాలు తమస్వలాభంకోసం వ్యతిరేకించినా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని తెలిపారు. ఏ ఎన్నికలు వచ్చినా దేశంలో భాజపాదే విజయఅని, ప్రజలంతా భాజాప వైపు ఉన్నారని తెలిపారు. భాజపా తదుపరి లక్ష్యం తెలంగాణ అని ఆయన స్పష్టం చేశారు. భాజపా బలపడితేనే

అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అభివృద్ధి, సుపరిపాలన అందించడమే భాజపా ప్రధాన అజెండా అని స్పష్టం చేశారు. వంశ పాలన, కులమత రాజకీయాలు ప్రజాస్వామ్య వ్యవస్థకు చేటు తెస్తాయని పరోక్షంగా కాంగ్రెస్‌ను ఆయన విమర్శించారు. తెలంగాణలో భాజపా ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతోందన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ ఏకపక్షపాలనతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# చిత్తూరులో ఏనుగుల బీభత్సం

చిత్తూరు,డిసెంబర్19(ఆర్ఎన్ఎ): రామకుప్పం మండలం ననియల అటవీప్రాంతంలో ఏనుగుల గుంపు బీభత్సం సృష్టిస్తున్నాయి. వరి, రాగి, అరటి పంటలను తొక్కి, తిని ఏనుగులు నాశనం చేశాయి.

జిల్లాలో ఏనుగుల సంచారంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. గ్రామస్తులు అధికారులకు సమాచారం అందించారు. అధికారులు ఏనుగులను తరమడానికి ప్రయత్నిస్తున్నారు. రోజురోజుకూ ఏనుగుల గుంపు దాడులు ఎక్కువవుతున్నాయని గ్రామస్తులు తెలిపారు.

# విశాఖలో వైకాపా నేతల ర్యాలీ

## పోలీస్ అధికారిపై దాడితో ఉద్రిక్తత

విశాఖపట్టణం,డిసెంబర్19(ఆర్ఎన్ఎ): నగరంలో వైసీపీ నేతలు దౌర్జన్యం ప్రదర్శించారు. తూర్పు నియోజకవర్గం సమన్వయ కర్త విజయనిర్మల ఆధ్వర్యంలో మూడు రాజధానులు ముద్దంటూ వైసీపీ నేతలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం వెలగపూడి, రామకృష్ణబాబు కార్యాలయం ముట్టడికి యత్నించిన వైసీపీ నేతలను పోలీసులు అడ్డుకున్నారు. ఎమ్మెల్యే వెలగపూడితోపాటు చంద్రబాబు దిష్టిబొమ్మను దగ్ధం చేయడంతో పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో తోపులాట జరిగింది. ఈ ఘటనలో వైసీపీ నేతలు సీఐను తోసేశారు. దీంతో ఆయన ఆటోపై పడడంతో తలకు తీవ్రగాయమైంది. వైసీపీ నేతల వ్యవహారశైలిపై పోలీసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ నేతల తీరును టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబు ఖండించారు.

# కెసిఆర్ కుటుంబ పాలన నుంచి తెలంగాణకు విముక్తి

## ప్రజలు మార్పు కోరుకుంటున్నారు

## బిజెపి వ్యవహారాల ఇన్‌చార్జ్ తరుణ్ చుగ్

హైదరాబాద్,డిసెంబర్19(ఆర్ఎన్ఎ): తెలంగాణ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ తరుణ్ చుగ్ తెలిపారు. ఆయన శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ తండ్రి కొడుకుల పార్టీ తెలంగాణను దోచుకుంటుందని దుయ్యబట్టారు. కుటుంబ పాలనతో లూటీ చేస్తున్నారని విమర్శలు గుప్పించారు. సెవెన్ స్టార్ ఫామ్ హౌస్ నుంచి సీఎం కేసీఆర్ బయటకు రావడంలేదని, ఒక్క గ్రామానికైనా, ఒక్క ఆస్పత్రికైనా, ఒక్క పేద వాడి ఇంటికైనా సీఎం వెళ్ళారా ? అని ప్రశ్నించారు. తెలంగాణలో నిజాం సర్కారు కొనసాగుతోందని మండిపడ్డారు. నిజాం వారసత్వ పాలనను తుదముట్టించాల్సి ఉందన్నారు. ప్రభుత్వ అధికార యంత్రాంగాన్ని అడ్డుపెట్టుకొని బీజేపీని తెలంగాణలో అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. గరీబ్ విముక్త్ భారత్ నిర్మాణానికి మోదీ ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. ఆయుష్మాన్ భారత్‌ను తెలంగాణలో ఎందుకు అమలు చేయడం లేదని తరుణ్ చుగ్ సీఎం కేసీఆర్‌పై తరుణ్ చుగ్ మండిపడ్డారు. తెలంగాణ సచివాలయంలో ఎవరూ ఉండరని ఆయన ఎద్దేవాచేశారు. తెలంగాణ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని తరుణ్ చుగ్ వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లో తరుణ్ చుగ్ పర్యటించారు. రాష్ట్ర బీజేపీ నేతలు బండి సంజయ్, ఎంపీ అర్వింద్, రాజాసింగ్, వివేక్‌తో ఆయన భేటీ అయ్యారు. ఈ సందర్భంగా నాగార్జునసాగర్ ఉప ఎన్నిక, ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై పార్టీ నేతలకు దిశా నిర్దేశం చేశారు.

# రిజిస్ట్రేషన్లు, మ్యూటేషన్‌ల రంగంలో విప్లవాత్మక మార్పులు

## దేశంలో ఎక్కడా లేని విధంగా చర్యలు: సిఎస్ సోమేశ్

హైదరాబాద్,డిసెంబర్19(ఆర్ఎన్ఎ): రిజిస్ట్రేషన్లు, మ్యూటేషన్‌ల రంగంలో దేశంలో మరే రాష్ట్రంలో లేని విధంగా తొలిసారిగా విప్లవాత్మక మార్పులను చేపట్టామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలోరిజిస్ట్రేషన్ల విధానాన్ని సరళీకృతం చేయడం, యూజర్ ఫ్రెండ్లీ, అవినీతి రహితంగా నియమిత కాలంలో రిజిస్ట్రేషన్, మ్యుటేషన్‌లను అందించాలన్నదే నూతన విధాన లక్ష్యమని అన్నారు. ఎంసిహెచ్ఆర్‌డిలో జరిగిన కార్యక్రమంలో సీఎస్ సోమేశ్‌కుమార్ మాట్లాడారు.

రియల్ ఎస్టేట్ వ్యవహారాల్లో అక్రమాలను అరికట్టి మరింత నాణ్యాతాయుత సేవలను అందించేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని తెలిపారు. ఈ విధానం వల్ల మధ్యవర్తుల ప్రమేయం లేకుండా తమ ఆస్తుల విలువలను లెక్కించడం, చెల్లించాల్సిన సుంకాలను తామే సులభంగా తెలుసుకునే వెసులుబాటు ఉన్నందున ప్రజల నుంచి పెద్దయెత్తున సానుకూల స్పందన లభిస్తోందన్నారు. ఐటీ రంగంలో అత్యుత్తమ విధానాలను అనుసరించడం ద్వారా డిజిటలైజ్ చేసిన సమాచారం, చిత్రాలను సురక్షితంగా ఉంచేందుకు ప్రభుత్వం అన్ని జాగ్రత్తలు చేపట్టిందని అన్నారు.

# వ్యవసాయ చట్టాలపైనే తమ పోరాటం: బాక్సర్ విజేందర్ సింగ్

న్యూఢిల్లీ,డిసెంబర్19(ఆర్ఎన్ఎ): రైతు వ్యతిరేక చట్టాలపైనే తమ పోరాటమని, కేంద్ర ప్రభుత్వంపై కాదని కాంగ్రెస్ నాయకుడు, ప్రముఖ బాక్సర్ విజేందర్ సింగ్ అన్నారు. శుక్రవారం టిక్రీ సరిహద్దులో జమిందర విద్యార్థి సంఘం (జేఎస్ఓ) ఆధ్వర్యంలో ఆందోళన చేస్తున్న రైతులకు ఆయన భోజనం అందజేసి మాట్లాడారు. రైతు వ్యతిరేక చట్టాలను కేంద్రం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

దేశ రైతులకు సేవ చేసేందుకు తాము ఇక్కడికి వచ్చామని అన్నారు. డిసెంబర్ 6న సైతం ఆయన హర్యానా-ఢిల్లీ సరిహద్దులో రైతులతో కలిసి ఆందోళనలో పాల్గొన్నారు.కేంద్రం నూతన వ్యవసాయ చట్టాలను వెనక్కు తీసుకోవాలని, లేకుంటే తన రాజీవ్ ఖేల్‌రత్న అవార్డును వెనుక్కు ఇచ్చేస్తానని ప్రకటించారు. నూతన వ్యవసాయ చట్టాలను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీ సరిహద్దులో రైతులు చేస్తున్న ధర్నా శుక్రవారానికి 23వ రోజుకు చేరింది.

# హుస్సేన్‌సాగర్‌లోకి రెండు కొత్త క్రూజ్‌లు

## సాగర్ పర్యాటకాన్ని పరిశీలించిన మంత్రి శ్రీనివాస గౌడ్

హైదరాబాద్,డిసెంబర్19(ఆర్ఎన్ఎ): నగరంలోని హుస్సేన్ సాగర్ జలాశయంలోకి నూతనంగా రెండు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం కలిగిన ఎలక్ట్రికల్ క్రూజ్ లను త్వరలో ప్రారంభిస్తున్నట్లు పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ వెల్లడించారు. హుస్సేన్ సాగర్ జలాశయం లోని బోటింగ్ కేంద్రాన్ని సందర్శించారు. బోటింగ్ కేంద్రాన్ని ఆకస్మికంగా పరిశీలించారు. అలాగే కొత్తగా సాగర్ జలాశయంలో రూపొందిస్తున్న క్రూజ్ బోట్ ల నిర్మాణ పనులను కూడా ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ హైదరాబాద్ అనేగానే హుస్సేన్ సాగర్, బుద్ధిని విగ్రహం సింబాలిక్ గా నిలిచిందన్నారు. కొత్తగా ఎలక్ట్రానిక్ క్రుజర్, బోట్ లను పర్యావరణ పరిరక్షణ లో భాగంగా దేశంలోనే మొదటి సారి గా ఏర్పాటు చేస్తున్నామన్నారు. త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. ఇందులో బర్త్ డే,ఇతర వేడుకలు జరుపుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు.దుర్గం చెరువు లో మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకు కూడా రెండు బోట్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు.హైదరాబాద్, తెలంగాణ వ్యాప్తంగా కూడా టూరిజం స్పాట్ గా అవతరిస్తుందన్నారు.తెలంగాణ ఏర్పడిన తరువాత విదేశీ టూరిస్ట్ ల సంఖ్య పెరుగుతోందన్నారు. కరోనా నేపథ్యంలో కొంత తగ్గిన మళ్ళీ పుంజుకుందని మంత్రి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. యాదాద్రి ఆలయం ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. అయితే అక్కడ విదేశీ టూరిస్ట్ లను ఆకట్టుకునేందుకు మరింత అద్భుతమైన టూరిజం స్పాట్ ఏర్పాటు కాబోతుందన్నారు. రానున్న కొద్దిరోజుల్లో పర్యావరణ పరిరక్షణ లో భాగంగా సోలార్,ఎలక్ట్రిక్ బోట్ లను అందుబాటులోకి తెస్తామన్నారు.కాళేశ్వరం ప్రాజెక్ట్ వల్ల మనకు సముద్రంలా నీళ్లు ఉన్నాయి. వాటిలో కూడా టూరిజం ను అభివృద్ధి చేస్తున్నామన్నారు.మూవింగ్ రెస్టారెంట్ 80 సీట్లతో సోలార్ క్రుజర్ ఏర్పాటు చేస్తున్నామన్నారు.హైదరాబాద్ ప్రజల అవసరాలకు అనుగుణంగా ఈ ఆధునిక హంగులు కలిగిన క్రూజ్ లను సాగర్ జలాశయం లో ఏర్పాటు చేస్తున్నా

మన్నారు. కార్యక్రమంలోపర్యాటక శాఖ ఎండీ మనోహర్ రావు, ఈడీ శంకర్ రెడ్డి, జీఎం ఇబ్రహీం, పర్యాటక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# మంచినీటి సరఫరా లక్ష్యమే మిషన భగీరథ

## సిఎం కెసిఆర్ వల్లనే ఇది సాధ్యమయ్యింది: ఎర్రబెల్లి

వరంగల్,డిసెంబర్19(ఆర్ఎన్ఎ): స్వచ్ఛమైన, పరిశుభ్రం చేసిన ఆరోగ్యవంతమైన మంచినీటిని తెలంగాణ ప్రజలకు అందించాలనే లక్ష్యంతోనే సీఎం కేసీఆర్ మిషన్ భగీరథ పథకాన్ని ప్రారంభించారని పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు.

46వేల కోట్ల వ్యయంతో మొదలు పెట్టి 34 వేల కోట్లు ఖర్చుచేసి 99శాతం గ్రామాలకు మంచినీటిని కేవలం రెండేళ్లలో అందిస్తున్న ఘనత తెలంగాణ ప్రభుత్వానిదేనని చెప్పారు. వరంగల్ మహానగర పరిధిలోని హసన్‌పర్తి, భీమారంలో మిషన్‌భగీరథ మానిటరింగ్ సెల్ కార్యాలయాన్ని మంత్రి ప్రారంభించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిషన్ భగీరథ వల్ల నల్గొండ జిల్లా ఫ్లోరైడ్ దాదాపు తగ్గిపోయిందన్నారు.

ఈ విషయాన్ని ప్రభుత్వమే ప్రకటించిందన్నారు. ప్రతి రోజూ ప్రతి పౌరుడికి తాగునీటిని అందిస్తున్నామన్నారు. వరంగల్ మహానగరంలో 47.50 మిలియన్ లీటర్ల నీటిని శుద్ధి చేసిన నీటిని, మరో 117 మి.లీ. శుద్ధిచేయని నీటిని అందిస్తున్నట్లు తెలిపారు. వరంగల్ మహానగర కార్పొరేషన్‌లో ప్రభుత్వం రోజు విడిచి రోజు వస్తున్న నీటిని వచ్చే ఫిబ్రవరి నుంచి ప్రతి రోజూ అందిస్తామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీ పసునూరి దయాకర్, స్టేషన్‌ఘనాపూర్ ఎమ్మెల్యే రాజయ్య, అధికారులు స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# సమాజాన్ని విచ్ఛిన్నం చేసే శక్తులతో జాగ్రత్త

## హాలియాలో క్రిస్మస్ కానుకలను అందచేసిన మంత్రి

నల్లగొండ,డిసెంబర్19(ఆర్ఎన్ఎ): సమాజాన్ని విచ్ఛిన్నం చేసేందుకు కొన్నిశక్తులు కుట్రలు చేస్తున్నాయని అటువంటి శక్తుల చేతికి చిక్కకుండా ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విద్యుత్ శాఖామంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని నల్లగొండ జిల్లా హాలియాలో మంత్రి శనివారం లబ్దిదారులకు ప్రభుత్వం తరపున క్రిస్మస్ కానుకలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. భిన్నత్వంలో ఏకత్వాన్ని ప్రతిబింబించే వారసత్వాన్ని కొనసాగిస్తున్నామన్నారు. అటువంటి వారసత్వాన్ని ప్రభుత్వ పరంగా నిర్వహించాలని సీఎం కేసీఆర్ యావత్ ప్రపంచంలోనే దుస్తుల పంపిణి వంటి వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టారన్నారు. ఇప్పటి వరకు మైనారిటీలను ప్రధాన రాజకీయ పక్షాలు ఓట్ల బ్యాంక్‌గా మాత్రమే చూశాయన్నారు. కానీ సీఎం కేసీఆర్ మాత్రం అందుకు భిన్నంగా ఈ తరహా సాహసోపేత నిర్ణయం తీసుకున్నారని కొనియాడారు. జాతిపిత మహాత్మాగాంధీ కన్న కలలను సాకారం చేస్తూ యావత్ భారతదేశములోనే తెలంగాణాలో ఆదర్శ పాలన కొనసాగిస్తున్నా మన్నారు. అటువంటి పాలననే మిగితా రాష్ట్రాలలో విస్తరించేందుకు ప్రజలు బాసటగా నిలబడాలని ఆయన కోరారు. జాతీయతభావం పెంపొందిస్తూ ఎటువంటి సందేహాలకు తావు లేకుండా సుఖంగా జీవిస్తున్న రాష్ట్రం ఏదైనా ఉంది అంటే దేశంలో ఒక్క తెలంగాణా మాత్రమేనని ఆయన స్పష్టం చేశారు.

# ఉత్తరాదిలో పెరిగిన చలితీవ్రత

## సిమ్లా, కాశ్మీర్‌లో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదు

న్యూఢిల్లీ,డిసెంబర్19(ఆర్ఎన్ఎ): ఉత్తరాదిలో చలి తీవ్రత పెరిగింది. అలాగే శీతలగాలులు కూడా తోడయ్యాయి. సిమ్లా, కశ్మీర్‌లో భారీగా మంచు కురుస్తోంది. ఇప్పుడు ఢిల్లీలో కూడా అత్యంత కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ప్రస్తుతం ఢిల్లీ ఉష్ణోగ్రతల పరంగా సిమ్లాను తలపిస్తోంది. ఢిల్లీలోని జాఫర్‌పూర్‌లో సాధారణం కన్నా 6 డిగ్రీల దిగువకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇక పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో ఉష్ణోగ్రతలు అత్యంత కనిష్టంగా నమోదవుతూ గత పదేళ్ల రికార్డుల

# మృతురాలి కుటుంబానికి పరామర్శ

రాజన్న సిరిసిల్లా, డిసెంబర్ 19 (నేటినిజం ప్రతినిధి):చందుర్తి మండలం నర్సింగాపూర్ గ్రామానికి చెందిన టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు మరాటి మాల్లిక్ మాతృమూర్తి లచ్చవ్వ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందగా ఈ కుటుంబాన్ని శనివారం తెలంగాణ మాజీ సర్పంచుల సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు బొడ్డు దేవయ్య ,రాష్ట్ర అధికార ప్రతినిధి సంపూ నూరి మల్లేశం గౌడ్,జిల్లా అధ్యక్షులు ఏ రెడ్డి మల్లా రెడ్డి ,జిల్లా కోశాధికారి ఏ రెల్లి నారాయణ, పరామర్శించారు, వీరి వెంట నాయకులు గడ్డం పద్మ గంగాధర్ ,మర్రి మల్లేశం జోగాపూర్ అశోక్ టీఆర్ఎస్ నాయకుడు మ్యాకల ఎల్లయ్య ఉన్నారు.

# సీనియర్ జర్నలిస్టును పరామర్శించిన టీయూడబ్ల్యూజే 143 రాష్ట్ర నాయకులు.

రాజన్న సిరిసిల్లా, డిసెంబర్ 19 (నేటినిజం ప్రతినిధి ):వేములవాడ పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్టు బీ ఇటీవలే గుండెపోటుతో మరణించారు. శుక్ర వారం రాత్రి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బిజిగిరి శ్రీనివాస్, టెంజు ఉ పాధ్యక్షులు ఊరడి రవి, జిల్లా నాయకులు బోనాల తిరుమల్,జేరిపోతుల సంపత్, నీ నియర్ జర్నలిస్టు లను కలిసి పరామర్శించారు.

వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి,సంతాపం వ్యక్తం చేశారు . వారి వెంట వేములవాడ ప్రెస్ క్లబ్ ఉ పాధ్యక్షులు మహమ్మద్ రఫీ ప్రధాన కార్యదర్శి భాస్కర్ రెడ్డి సంయుక్త కార్యదర్శి కే శ్రీనివాస్ ప్రెస్ క్లబ్ సభ్యులు సయ్యద్ అలీ,ఆసీమ్ ఖాన్,ముషాహిద్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# నాలుగు సీట్లు గెలవగానే హీరోలై పోతారా?

## బిజెపి నేతలపై మండిపడ్డ మంత్రి తలసాని

సూర్యాపేట,డిసెంబర్19(ఆర్ఎన్ఎ): గ్రేటర్ ఎన్నికలలో నాలుగు సీట్లు గెలవగానే బిజెపి నేతలు నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ మండిపడ్డారు. కొత్త బిచ్చగాళ్ళు పొద్దెరగరు అన్నట్లుగా బిజెపి నేతలు వ్యవహరిస్తున్నారని మంత్రి తలసాని విమర్శించారు. సూర్యాపేట జిల్లా కోదాడ నియోజకవర్గ పరిధిలోని ఆకుపాములలో మీడియా సమావేశంలో మాట్లాడిన మంత్రి.. కేవలం రెండు ఎన్నికలలో గెలుపుకే బీజేపీ నాయకులు విర్రవీగుతున్నారని, టీఆర్ఎస్ అనేక ఎన్నికలను చూసిందన్న విషయాన్ని మరవొద్దని హితవు పలికారు. దేశం గర్వపడే విధంగా ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్న తలసాని.. పదేపదే ముఖ్యమంత్రిని అరెస్ట్ చేస్తామంటున్న బీజేపీ నేతలకు నిజంగా ఆ ధైర్యం ఉందా అని హెచ్చరించారు. వరద ముంపుకు గురైన కుటుంబాలకు 25 వేల రూపాయలు చొప్పున ఆర్థిక సహాయం అందించకుంటే ప్రజలే మీ పై తిరగబడ తారని అన్నారు. ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని ప్రజలకు సేవ చేసుకొనేందుకు వినియోగించాలన్నారు బీజేపీ నేతలను ఉద్దేశించి అన్నారు. బీజేపీ నాయకులు పదేపదే ముఖ్యమంత్రిని అరెస్టు చేస్తామంటున్నారు. మీకు ఆ ధైర్యం ఉందా? అని శ్రీనివాస్ యాదవ్ ప్రశ్నించారు. ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని వారికి సేవ చేసేందుకే వినియోగించాలని హితవు పలికారు.

# పెట్రో ధరలు..సిలిండర్ రేట్లు మరచి పోయారా?

## బిజెపి నేతలకు ఎమ్మెల్యే జగ్గారెడ్డి చురకలు

హైదరాబాద్,డిసెంబర్19(ఆర్ఎన్ఎ): తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్‌పై కాంగ్రెస్ ఎమ్మెల్యే జగ్గారెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. శనివారం ఆయన మీడియా సమావేశంలో మాటా ్లడుతూ ప్రజా సమస్యల పై మాట్లాడకుండా యువతను రెచ్చగొట్టే విధంగా బండి సంజయ్ వ్యాఖ్యలు చేస్తున్నారంటూ మండి వడ్డారు. బీజేపీ కేంద్రంలో అధికారంలోకి రావడానికి ఇచ్చిన హామీలు ఆయనకు గుర్తున్నాయా అని ప్రశ్నించారు. పేదల ఖాతాల్లో వేస్తామన్న 15 లక్షల ఏమయ్యాయి. కనీసం తెలంగాణలోని పేదలకైనా 15లక్షలు వచ్చాయా.. రాకుంటే ప్రధానితో మాట్లాడి బండి సంజయ్ ఇప్పించగలరా.. దీనిపై బండి సంజయ్ ఎందుకు సమాధానం చెప్పడం లేదు. ఆలయాలు, దేవుళ్లు తప్ప.. పేదల ఇబ్బందులు ఆయనకు గుర్తుకురావా. యూపీఏ ప్రభుత్వంలో క్రూడాయిల్, సిలిండర్లపై పది పైసలు పెంచితే బీజేపీ నానాయాగి చేసేది. మరి ఇప్పుడు బీజేపీ ప్రభుత్వం ఏం చేస్తుంది. ఇప్పటి కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ సిలిండర్ రోడ్డు పై పెట్టుకుని నిరసన చేసింది మర్చిపోయారా? యూపీఏ ప్రభుత్వంలో 40 రూపాయలు ఉన్న లీటర్ పెట్రోల్ ఇప్పుడు డబుల్ అయింది. మరి బండి సంజయ్ ప్రధానితో మాట్లాడి ధర తగ్గిస్తారా.. ? యూపీఏ ప్రభుత్వంలో లీటర్ డీజిల్ 36 రూపాయలు ఉంటే ఇప్పుడు 78 రూపాయలయ్యింది. ఇది ప్రజలకు ఎంత భారమో బీజేపీ ప్రభుత్వానికి తెలుస్తుందా. కాళీ కామాతా భూముల గొడవ ముఖ్యమా..? క్రూడాయిల్ ధరల పెరుగుదల వల్ల ప్రజల ఇబ్బందులు ముఖ్యమా? అంటూ జగ్గారెడ్డి దుయ్యబట్టారు.

# ధరణి విఫలప్రయత్నం: మురళీధర్ రావు

హైదరాబాద్,డిసెంబర్19(ఆర్ఎన్ఎ): ధరణి వ్యవస్థ విఫల ప్రయత్నమని బీజేపీ నేత మురళీధర్‌రావు పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో అన్నారు. ధరణి వల్ల రిజిస్ట్రేషన్లు అస్తవ్యస్తంగా మారాయని ఆరోపించారు. దొంగ రిజిస్ట్రేషన్ చేసుకునే వారికి ధరణి స్వర్గధామమన్నారు. ధరణిలో లింక్ డాక్యుమెంట్ల వివరాలు లేవని తెలిపారు. ధరణి రిజిస్ట్రేషన్లపై హైకోర్టుకు ప్రభుత్వం తప్పుడు సమాచారం ఇచ్చిందని మురళీధరరావు తప్పుబట్టారు. ధరణి వ్యవస్థ రాష్ట్ర రెవెన్యూ లోటుకి కారణమైందని, పాత పద్ధతిలోనే రిజిస్ట్రేషన్లు చేయాలని డిమాండ్ చేశారు. బిల్లర్ల ఆందోళనకు బీజేపీ మద్దతు ఇస్తుందని మురళీధరరావు ప్రకటించారు.

# అంతరాతీయ శీతోష్ణస్థితి పరిరక్షణ అగ్రగామిగా సీడీపీ గుర్తింపు పొందిన లానెక్సెస్

ముంబై, డిసెంబర్, 19: శీతోష్ణస్థితి మార్పు ను ఎదుర్కోవడంలో లానెక్సెస్ ప్రయ త్నాలు మరోసారి అంతర్జాతీయ శీతోష్ణస్థితి పరిరక్షణ అగ్రగామి అయిన సీడీపీ గుర్తిం పు పొందాయి. తాజాగా చేసిన మదింపులో ఈ స్పెషాలిటీ కెమికల్స్ కంపెనీ మరోసా రి 270 కంపెనీల్లో ఒకటిగా 'క్లైమేట్ ఎ జాబితా'లో చేర్చబడింది. సీడీపీ మొత్తం 5,800 సంస్థలను మదింపు వేయగా అందులో లానెక్సెస్ మొదటి 5 శాతం కంపెనీ ల్లో ఒకటిగా ఉంది. శీతోష్ణస్థితి పరిరక్షణ పై తాము చేపట్టే కార్యక్రమాల గురించి నిర్దిష్ట పారదర్శక, సమ గ్ర విధానంలో నివేదించే, అమలు చేసే కంపెనీలకు స్కోర్ 'ఎ' ఇస్తారు. 'ఎ' జాబితా లో చేరడం లానెక్సెస్ కు ఇది నాలుగోసారి. శీతోష్ణస్థితి పరిరక్షణకు సంబంధించిన వివరాలను ఈ కంపెనీ 2012 నుంచి కూడా సీడీపీకి తెలియజే స్తోంది. ఈ సందర్భంగా లానెక్సెస్ ఏజీ బోర్డ్ ఆఫ్ మేనేజ్ మెంట్ సభ్యులు హుబర్ట్ ఫింక్ మాట్లాడుతూ, "శీతోష్ణస్థితి పరిరక్షణ లానెక్సెస్ కార్పొరెట్ వ్యూహంలో ప్రధానాంశం. 2040 నాటికి క్లైమేట్ న్యూట్రల్ కావాలనే మా ఆశయాన్ని మేం నొక్కి చెబుతు న్నాం. మరోసారి సీడీపీ నుంచి శీతోష్ణస్థితి పరిరక్షణ అగ్రగామి గా గుర్తింపు పొందడం మేం సరైన మార్గంలోనే పయనిస్తున్నామనే అంశాన్ని స్పష్టం చేస్తుంది" అన్నారు. ఇటీవలే లానెక్సెస్ మరో సారి డవ్ జోన్స్ సస్టెయినబిలిటీ ఇండీసెస్ (డీజేఎస్ఐ) వరల్డ్ మరియు యూరప్ లో చేర్చబడింది. ఇతర అంశాలతో పాటుగా క్లైమేట్ వ్యూ హం విభాగంలో సాధించిన ఫలితాలు అందుకు దోహదం చేశాయి. ఈ స్పెషాలిటీ కెమికల్స్ కంపెనీ డీజేఎస్ఐ యూరప్ లో 'కెమికల్స్' విభాగంలో గత ఏడాది మాదిరి గానే అగ్రస్థానంలో నిలిచింది. డీజేఎస్ఐ వరల్డ్ లో రెండో స్థానానికి మెరుగుపడింది. "మరింత సుస్థిరదాయకత, శీతోష్ణస్థితి పరిరక్షణ పట్ల మా అంకితభావానికి మరెంతో విస్తృత గుర్తింపు రావడం మాకెంతో ఆనందదాయకం" అని ఫింక్ అన్నారు.

# దళితమహిళ హత్యపై స్పందించరా: వర్ల

అమరావతి,డిసెంబర్19(ఆర్ఎన్ఎ): సీఎం జగన్ నియోజకవర్గంలో దళిత మహిళ హత్యకు గురైతే స్పందించలేదని టీడీపీ నేత వర్ల రామయ్య మండిపడ్డారు. సొంత బాబాయి హత్య కేసునే నీరుగార్చాలని చూసిన సీఎం జగన్‌కు.. దళిత మహిళ హత్య కేసు దోషులను శిక్షిస్తామంటే ప్రజలు ఎలా నమ్ముతారని అనుమానం వ్యక్తం చేశారు. జగన్ ఢిల్లీ పర్యటనపై అనుమానాలున్నాయని తెలిపారు. మాజీమంత్రి వివేకానందరెడ్డి హత్యకేసులో సీబీఐ విచారణకు జగన్ మోకాలడ్డుతున్నారని వర్ల రామయ్య ఆరోపించారు.

# ఒకేసారి 4 లక్షల ఉద్యోగాలు కల్పించిన ఘనత జగన్‌ది

## గుంటూరులో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రులు

గుంటూరు,డిసెంబర్19(ఆర్ఎన్ఎ): చిలకలూరిపేటలో రూ.46 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులకు మంత్రులు శ్రీకారం చుట్టారు.

గడియార స్తంభం వద్ద మంత్రులు బొత్స సత్యనారాయణ, చెరుకువాడ శ్రీరంగనాథ రాజు పైలాన్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యేలు అంబటి రాంబాబు, విడదల రజిని పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ ఒకేసారి 4 లక్షల ఉద్యోగాలు కల్పించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే నన్నారు. అనుకూల మీడియాతో చంద్రబాబు.. పథకం ప్రకారం బురదచల్లుతున్నారని మండిపడ్డారు. కరోనా సమయంలో కూడా సీఎం జగన్ ప్రజలను ఆదుకున్నారని, గ్రామ సచివాలయం, వాలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రజలకు సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు. వెనుకబడిన కులాలకు ప్రత్యేక కార్పొరేషన్లు కల్పించిన ఘనత సీఎం జగన్‌దేనన్నారు. రాష్ట్రంలో ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్న ప్రజల సంక్షేమం కోసం సీఎం జగన్ అనేక పథకాలు అమలుచేస్తున్నారని తెలిపారు.నెల 25న పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ చేస్తున్నామని మంత్రి శ్రీరంగనాథరాజు పేర్కొన్నారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని 2400 జబ్బులను ఆరోగ్యశ్రీ లో చేర్చి సీఎం వైఎస్ జగన్ ఆరోగ్య ప్రదాత అనిపించుకున్నారని తెలిపారు. ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి టీడీపీని లాక్కున్న వ్యక్తి చంద్రబాబు అని ఎమ్మెల్యే అంబటి రాంబాబు దుయ్యబట్టారు. చంద్రబాబు దొడ్డిదారిన లోకేష్‌ను మంత్రిని చేశారని మండిపడ్డారు. లోకేష్‌ను ఎమ్మెల్యేగా కూడా చంద్రబాబు గెలిపించుకోలేక పోయారని ఆయన ఎద్దేవా చేశారు. చంద్రబాబు చేయిస్తున్న అమరావతి ఉద్యమం ఒక ఫేక్ అని అంబటి రాంబాబు ధ్వజమెత్తారు.

# కిచెన్ గార్డెన్‌లతో కూరగాయల పంటలు

## గర్భిణులు, చిన్నారులకు మేలంటున్న మంత్రి

హైదరాబాద్,డిసెంబర్19(ఆర్ఎన్ఎ): సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు రాష్ట్రంలోని ప్రతి అంగన్‌వాడీ సెంటర్‌లో కిచెన్ గార్డెన్‌లు ఏర్పాటు చేసుకున్నట్లు స్త్రీ – శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ తెలిపారు. ఆరోగ్యలక్ష్మి పథకం కింద ఇచ్చే కూరగాయలు, ఆకుకూరలను కిచెన్ గార్డెన్‌లలో పండిస్తున్నా మని తెలిపారు. వీటిని గర్భిణి స్త్రీలకు, పిల్లలకు అందిస్తున్నామని మంత్రి సత్యవతి చెప్పారు. హైదరాబాద్ లోని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ కమినరేట్లో దాదాపు రూ. 58 లక్షలతో నిర్మించిన ప్రహరీ గోడ, సీసీ రోడ్లు, ఆధునీకరించిన కార్యాలయంతో పాటు పిల్లలకు పోషకాహారాలు అందించే న్యూట్రి గార్డెన్‌ను స్త్రీ – శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వెంగ్రూవ్‌నగర్ కార్పొరేటర్ దేదీప్య, కమిషనర్, ప్రత్యేక కార్యదర్శి దివ్య, అధికారులు అనురాధ, లక్ష్మి, వౌతితో పాటు పలువురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ.. మహిళా, శిశు సంక్షేమ అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఈ ప్రాంగణంలో 600 మందికి పైగా చిన్న పిల్లలు ఉన్నారు. ఆ పిల్లలకు మంచి పోషాకాహారం ఇవ్వాలనే ఉద్దేశంతో న్యూట్రి గార్డెన్‌ను ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. కమిషనరేట్‌ను ఆధునీకరించు కోవడం సంతోషంగా ఉందన్నారు.

# రైతు వేదికను ప్రారంభించిన మంత్రులు

నిర్మల్,డిసెంబర్19(ఆర్ఎన్ఎ): నిర్మల్ మండలం చిట్యాలలో ఏర్పాటు చేసిన రైతు వేదికను మంత్రులు నిరంజన్ రెడ్డి, ఇంద్రకరణ్ రెడ్డి, రైతు సమన్వయ సమితి రాష్ట్ర చైర్మన్ వల్లా రాజేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి మాట్లాడుతూ.. రైతులను సంఘటితం చేసేందుకే రైతు వేదికల నిర్మాణం చేపట్టామని చెప్పారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రైతు వేదికలు, రైతు బంధు పథకం దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని తెలిపారు. పంటల సాగుపై చర్చించుకునేందుకు రైతు వేదికలు రైతులకు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. తెలంగాణ ఏర్పాటైన తర్వాత రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని గుర్తు చేశారు. రైతుల సంక్షేమం కోసం టీఆర్ఎస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి స్పష్టం చేశారు.

# జోబైడెన్ టీమ్‌లో మరో ప్రవాసుడు

## అసిస్టెంట్ ప్రెస్ సెక్రటరీగా వేదాంత పటేల్

వాషింగ్టన్,డిసెంబర్19(ఆర్ఎన్ఎ): అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ వైట్ హౌస్ అసిస్టెంట్ ప్రెస్ సెక్రటరీగా ప్రవాస భారతీయుడు వేదాంత్ పటేల్‌ను నియమించారు. బైడెన్ శిబిరంలో పటేల్ సీనియర్ అధికార ప్రతినిధిగా వ్యవహరిస్తున్నారు. అలాగే ఆయన ప్రచారవర్గంలో రీజనల్ కమ్యూనికేషన్ డైరెక్టర్ గాను, అంతకుముందు నెవాడా–వెస్టర్న్ ప్రైమరీ స్టేట్స్ కమ్యూనికేషన్స్ డైరెక్టర్ గా, ఒకప్పుడు ఇండియన్–అమెరికన్ కాంగ్రెస్ ఎంపీ ప్రమీలా జయపాల్ కు కూడా ఇదే హోదాలో డైరెక్టర్ గా ఆయన వ్యవహరించారు. ఇండియాలో పుట్టి కాలిఫోర్నియాలో పెరిగిన వేదాంత్ పటేల్.. ఎ÷–లోరిడా యూనివర్సిటీ నుంచి గ్రాడ్యుయేట్ పట్టా అందుకున్నారు. వైట్ హౌస్ కమ్యూనికేషన్స్, ప్రెస్ స్టాఫ్ కోసం బైడెన్ ప్రకటించిన 16 మందిలో పటేల్ ఒకరు. ఈ టీమ్ అంతా వారివారి రంగాల్లో ప్రతిభగలవారని వైట్ హౌస్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ రాన్ తెలిపారు.

# పెళ్లింట్లో భారీ దొంగతనం

## 2కిలోల బంగారం..8లక్షల నగదు చోరీ

మహబూబ్‌నగర్,డిసెంబర్19 (ఆంఎన్ఎ): మరో మూడు రోజుల్లో పెళ్లి. ఇల్లంతా చుట్టాలతో హడావుడిగా ఉంది. ఇంతలోనే ఊహించని ఘటన. పెళ్లి కోసం తెచ్చిన నగలు, నగదు తెల్లారేసరికి మాయం. ఈ ఘటన మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగింది. మిడ్జిల్ మండలం బోయిన్ పల్లిలో పెళ్లింట్లోకి చొరబడ్డ దొంగలు ఈ భారీ చోరీకి పాల్పడ్డారు. గ్రామానికి చెందిన ఇంద్రారెడ్డి కొడుకు తిలక్ రెడ్డి వివాహం ఈ నెల 23న జరగనుంది. పెళ్లి కోసం బ్యాంక్ లాకర్ నుంచి నగలు తెచ్చి ఇంట్లో ఉంచారు. అంతేకాకుండా.. ఇంద్రారెడ్డి అన్న ఇళ్లు ప్రస్తుతం నిర్మాణంలో ఉండటంతో.. వారి బంగారం కూడా ఇంద్రారెడ్డి ఇంట్లోనే దాచారు. అయితే పెళ్లి దగ్గరపడటంతో ఇంట్లో బంగారం, డబ్బులు దొరుకుతాయని భావించిన దొంగలు.. శుక్రవారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. ఇంట్లో బీరువాలో దాచిన 210 తులాల నగలు, 8 లక్షల నగదు ఎత్తుకెళ్లారు. ఇంట్లో వాళ్లంతా నిద్రిస్తున్న సమయంలో అర్ధరాత్రి దొంగలు ఇంట్లోకి వచ్చినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. నగల విలువ విలువ దాదాపు 2 కోట్ల రూపాయల వరకు ఉంటుందని అంచనా. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# బెంగాల్ పర్యటనలో హోంమంత్రి అమిత్ షా

## రైతు ఇంట్లో భోజనంతో కార్యక్రమానికి శ్రీకారం

## బిజెపిలో చేరిన సుబేందు అధికారి

కోల్‌కతా,డిసెంబర్19(ఆర్ఎన్ఎ): పశ్చిమ బెంగాల్ సందర్శనకు వచ్చిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఒక రైతు ఇంట్లో భోజనం చేశారు. పశ్చిమ్ మెడినిపూర్ జిల్లాలోని బెలిజూరి గ్రామానికి చెందిన అన్నదాత ఆతిథ్యాన్ని ఆయన స్వీకరించారు. బీజేపీ ప్రధాన కార్యదర్శి కైలాష్ విజయవర్గియా, రాష్ట్ర బీజేపీ చీఫ్ దిలీప్ ఘోష్‌తో కలిసి భోజనం చేశారు. ఓ వైపు వ్యవసాయ చట్టాలను కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని మెజార్టీ రైతు సంఘాలు డిమాండ్ చేస్తూ ఢిల్లీ సరిహద్దుల్లో గత కొన్ని రోజులుగా నిరసనలు చేస్తున్నారు. మరోవైపు కొందరు రైతుల మద్దతు పొందేందుకు కేంద్ర మంత్రులు, బీజేపీ నేతలు ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగా వారితో సమావేశాలు జరుపడంతోపాటు విందు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కాగా బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అమిత్ షా పక్షం రోజుల్లోనే మరోసారి ఆ రాష్ట్ర పర్యటనకు వచ్చారు. శనివారం తెల్లవారుజామున 1:30 గంటలకు కోల్‌కతా చేరుకున్నారు. ఈ విషయాన్ని ఆయనే ట్వీట్ చేశారు. 'కోల్‌కతాకు చేరుకున్నాను. గురుదేవ్ ఠాగూర్, ఈశ్వర్ చంద్ర విద్యాసాగర్, శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వంటి గొప్ప నాయకుల గడ్డ మీద అడుగుపెట్టిన సందర్భంగా ఈ భూమికి నమస్కరిస్తున్నా' అని పేర్కొన్నారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా అమిత్ షా తొలుత కోల్‌కతాలోని స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

అనంతరం రామకృష్ణ ఆశ్రమాన్ని సందర్శించారు. కోల్‌కతాలోని రామకృష్ణ ఆశ్రమాన్ని సందర్శించిన ఆయన.. వివేకానందునికి నివాళులర్పించారు. వివేకానంద చూపించిన మార్గంలోనే మనమంతా నడవాలని ఆయన అన్నారు. అనంతరం స్వాతంత్ర్య సమరయోధుడు ఖుదీరామ్ బోస్ స్వగ్రామం పశ్చిమ్ మిడ్నాపూర్‌ను సందర్శించారు. ఖుదీరామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. గ్రామంలోని ఆయన కుటుంబ సభ్యులను కలిసి మాట్లాడారు. వారిని శాలువాతో సత్కరించి తన గౌరవాన్ని చాటుకున్నారు. 'స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను దేశం ఎన్నటికీ మరవదని ఆయన వ్యాఖ్యానించారు. చేతిలో భగవద్గీతతో 18ఏళ్ల చిరుప్రాయంలోనే ఉరికంబమెక్కిన వీరుడు ఖుదీరామ్ అంటూ అమిత్ షా ఉద్వేగానికి గురయ్యారు. తృణమూల్ మాజీ నేత, మమతా బెనర్జీకి అత్యంత సన్నిహితుడైన సుబేందు అధికారి శనివారం బీజేపీలో చేరారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఆధ్వర్యంలో మిడ్నాపూర్‌లో జరిగిన ఓ బహిరంగ సభలో సుబేందు బీజేపీలో చేరారు. నన్ను పార్టీలోకి ఆహ్వానించినందుకు అమిత్‌షాకు ధన్యవాదాలు. నాకు బీజేపీతో సుదీర్ఘ అనుబంధం ఉంది. టీఎంసీ నాయకత్వం నన్ను బాగా అవమానాలకు గురిచేసిందని సుబేందు మండిపడ్డారు. అంతకు పూర్వం సుబేందు అధికారి టీఎంసీ నాయకత్వానికి ఓ బహిరంగ లేఖ రాశారు. ఒక్క రోజులోనే తృణమూల్ నిర్మాణం జరగలేదు. ఏ ఒక్క వ్యక్తో దీనిని నిర్మించ లేదు. పార్టీ నిర్మాణం అనేది నిరంతర ప్రయత్నం. 10 సంవత్సరాలుగా పార్టీ నిర్మాణం కోసం చాలా శ్రమించాం. ఆ ఫలితాన్నే ఇప్పుడు మనం చూస్తున్నాం. ఇదంతా మరిచిపోయి, ప్రస్తుతం కొందరు పార్టీని తమ సొంత ఆస్తిలాగా భావిస్తున్నారు. అంతలా పార్టీ కోసం కష్టపడ్డ నాయకులను ఇప్పుడు తీవ్రంగా అవమానిస్తున్నారు. వారిని పక్కన పెట్టేస్తున్నారు. అవతలి వ్యక్తుల సహాయాన్ని అర్థిస్తున్నారు. కార్యక్షేత్రంలో ఏం జరుగుతుందో తెలుసుకోకుండా కలలు కంటున్నారు. వారికి త్యాగం గురించి ఏమాత్రం తెలియదని అంటూ పరోక్షంగా వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్, సీఎం మమతా బెనర్జీపై విరుచుకుపడ్డారు.

# మహిళలపై లైంగిక వేధింపులపై తక్షణ చర్యలు

## కోర్‌గ్రూప్ భేటీలో స్మితా సబర్వాల్ సూచన

యాదాద్రి భువనగిరి, డిసెంబర్20 (ఆర్ఎన్ఎ): పనిచేసే చోట లైంగిక వేధింపులపై ఫిర్యాదులు అందితే కలెక్టర్లు తక్షణమే స్పందించి అక్కడికక్కడే బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని సీఎం కార్యాలయ కార్యదర్శి స్మితా సబర్వాల్ అన్నారు. మహిళల భద్రత కోసం ఐఏఎస్, ఐపీఎస్ మహిళా అధికారులతో ఏర్పాటైన అత్యున్నతస్థాయి కోర్ గ్రూప్ కమిటీ శుక్రవారం స్మితా సబర్వాల్ అధ్యక్షతన భువనగిరిలో సమావేశమైంది. మహిళలకు అత్యవసర సహాయం కోసం, భద్రత కోసం ఏర్పాటు చేసిన డయల్ 100, 181 తదితర హెల్ప్‌లైన్ వ్యవస్థల పనితీరు గురించి, ఇతర సలహాలను, సూచనలను కమిటీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్మితా సబర్వాల్ మాట్లాడుతూ..మహిళా శక్తిని మించిన శక్తి ప్రపంచంలో మరొకటి లేదన్నారు. మహిళల భద్రతా పరమైన సమస్యలు తెలుసుకుని ఉన్నతస్థాయికి తీసుకెళ్లి పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామన్నారు. మహిళల భద్రత, రక్షణ కోసం ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ నెంబర్లపై విస్తృత ప్రచారం కల్పించి అవగాహన కలిగి ఉండేలా చూడాలన్నారు. మహిళల భద్రతా పరమైన సమస్యలు తెలుసుకుని ఉన్నతస్థాయికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. తెలంగాణలోని ప్రతి మహిళా భద్రతతో ఉండేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని అన్నారు. మహిళల భద్రత , రక్షణ కోసం హెల్ప్‌లైన్‌నెంబర్లపై విస్తృత అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ప్రస్తుతం ఉన్న భరోసాతో పాటు చేపట్టాల్సిన చర్యలను క్షేత్రస్థాయిలో నిజాని జాలు తెలుసుకుని నివేదికను రూపొం దిస్తామని తెలిపారు. గత 4, 5 సంవ త్సరాల్లో ఇదే కమిటీ నివేదిక ఆధారంగా షీ టీమ్స్ ఏర్పాటు అయ్యిందన్నారు. ఉద్యోగులు పని చేసే చోట లైంగిక వేధింపులపై ఫిర్యాదులు చేసినట్టయితే కలెక్టర్లు వ్యక్తిగతంగా స్పందించి తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. ఈ విషయంలో సర్క్యులర్ ఆదేశాలు ఉన్నందున బాధ్యులను అక్కడికక్కడే సస్పెండ్ చేయంతో పాటు శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆమె కలెక్టర్లను కోరారు. ఈ విషయంలో ఇంకా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టేందుకు పరిశీలిస్తున్నట్టు చెప్పారు. గ్రామాలలో స్థలాలు లేకున్నా సిసిరోడ్లు కావాలని కోరడం కాకుండా భద్రత కోసం వీధి దీపాలు కావాలని, పారిశుద్ధ్య చర్యలు తీసుకోవాలని ప్రజలు ప్రశ్నించాలని ఆమె అన్నారు. హింస జరిగిన వెంటనే 181 నెంబరు ద్వారా సభి సెంటర్ హెల్ప్‌లైన్‌కు కాల్‌చేయాలన్నారు. అవసరమైతే 100 హెల్ప్‌లైన్‌కు వెంటనే ఫార్వర్డ్ చేసే బాధితులకు సత్వర భద్రత చేకూర్చడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలేరు ఎమ్మెల్యే సునీతా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ మహిళలు తమ సమస్యలను అధిగమించేందుకు మానసికంగా బలోపే తం కావాలన్నారు. సమావేశంలో స్త్రీ, శిశుసంక్షేమశాఖ కమిషనర్ దివ్య దేవరాజ్, సీనియర్ ఐఏఎస్ అధికారి యోగితా రాణా, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ వాకాటి కరుణ, హైదరాబాద్ కలెక్టర్ శ్వేతా మహంతి, నల్గొండ జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, భువనగిరి జిల్లా కలెక్టర్ అనితా రాంచంద్రన్, హైదరాబాద్ షీటీమ్ ఇన్‌చార్జి అనసూయ తదితరులు పాల్గొన్నారు.

## సిటిసిలోని చిట్టడవులు, పర్యావరణ, పక్షుల ప్రేమికుల కోసం

# నూతన ప్రాజెక్టులను సందర్శించిన నగర మేయర్, మున్సిపల్ కమిషనర్

కరీంనగర్. డిసెంబర్ 19 (నేటినిజం ప్రతినిధి): కరీంనగర్‌లోని కమిషనరేట్ పోలీస్ శిక్షణ కేంద్రం(సిటిసి)లో మియావాకి పద్ధతిలో యాదాద్రి మోడల్ తరహాలో చిట్టడవులు ఏర్పాటు, హరితాహారంలో భాగంగా నాటిన మొక్కలను సంరక్షించేందుకు తీసుకుంటున్న చర్యలతోపాటు నూతనంగా చేపట్టబోతున్న ప్రాజెక్ట్‌లు పర్యావరణ, పక్షుల ప్ర